ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 14 డిసెంబరు 2024 | 5




పుష్పాలదరహో..

కడియంలో సీజనల్ సందడి

పూల కడియం ఎందుకు అంటారో తెలియాలంటే సరిగ్గా ఇప్పుడే అక్కడకు వెళ్లాలి. ఈ సీజనల్ పుష్పాలకు ఇదే సరైన సమయం. ఏ నర్సరీ చూసినా విరబూసిన సుమాల సొబగులు మనసు దోచేస్తాయి. హరివిల్లు సైతం చిన్నబోయే ఆ అందాలను మీరూ చూసేయండి ... 6లో






సారవంతమైన భూముల్లో నిర్మిస్తున్న చెరువు గట్లు, రొయ్యల చెరువుల తవ్వకం కోసం పని చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

రాత్రివేళ జోరుగా...

సారవంతమైన భూముల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు

మత్స్య శాఖ జేడీకి ఓ రైతు ఫిర్యాదు... కలెక్టర్‌కు వినతిపత్రం

అమలాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సారవంతమైన పంట భూముల్లో పర్యావరణ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ రొయ్యల చెరువుల తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామానికి చెందిన రైతు కమ్మ శ్రీనివాసరావు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అధికార పార్టీనేతల అండదండలతో రాత్రివేళల్లో మూడు, నాలుగు ఎక్స్‌కవేటర్లతో గోదావరి గట్టు సమీపంలో ఆక్వా చెరువులు తవ్వడాన్ని నిరోధించాలని కోరుతున్నాడు. వెలిచేరు గ్రామంలో సర్వే నెం.49-7ఎ, 8ఎ, 8సి, 56/1ఎ, 60-1, 61-4, 61-5, 53-1కు చెందిన భూముల్లో రాత్రివేళల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు జోరుగా చేస్తున్నారని ఆ రైతు ఫిర్యాదులో వివరించాడు. ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉండే పిరమిడ్‌కు సమీపంలోనే చెరువుల తవ్వకాలు చేపట్టడం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు జల కాలుష్యం, అనారోగ్య పరిస్థితులు ఉత్పన్నమవుతాయని, ఈ దృష్ట్యా తక్షణం చెరువుల తవ్వకాలను నిరోధించాలని మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులను శ్రీనివాసరావు కోరాడు. చెరువుల తవ్వకాలు నిలిపివేయమని అధికారులు ఆదేశించినప్పటికీ రాజకీయ పలుకుబడితో వాటిని పట్టించుకోకుండా రాత్రివేళల్లో తవ్వకాలు సాగిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వుతున్న రైతును అరెస్టు చేసి ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకోవాలని రైతు డిమాండు చేశాడు. ఈ మేరకు కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించాడు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న వైసీపీ నేతలు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


కలెక్టరేట్‌ను ముట్టడించిన వైసీపీ నేతలు

వివిధ డిమాండ్లతో వినతిపత్రం అందజేత

వార్త 8లో

దొంగనోట్ల ముఠా అరెస్ట్

...వివరాలు 7లో



కాకినాడ తీరంలో ఓడ

బార్జీని లాక్కెళుతున్న బోటు

దోపిడీకి..ద్వారం!

కాకినాడలో కుంభకోణాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ అంటే పెన్షనర్స్ ప్యారడైజ్. ఎన్నో దశాబ్దాల నుంచి ఈ నగరానికి ఆ పేరు ఉంది. కానీ ఇప్పుడు వరుస కుంభకోణాలతో కాకినాడ కాకెక్కిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిలువునా దోచేసి కాకినాడను కుంభకోణాల నగరంగా మార్చేశారు. దీనికి నిలువెత్తు నిదర్శనమే కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు వేల కోట్ల రూపాయల రేషన్ బియ్యం అక్రమ రవాణా.. సీపోర్టులో బెదిరించి కేవీరావు నుంచి వాటాలను బలవంతంగా లాగేసుకున్న వ్యవహారం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సిట్..సీపోర్టు ప్రధాన వాటాదారుడు కేవీరావు నుంచి వాటాలను కొట్టేసిన వైనంపై సీఐడీని ప్రభుత్వం నియమించింది. కాకినాడతో ముడిపడి ఉన్న ఈ రెండు ఘటనలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. తాజాగా కలెక్టర్ల సదస్సులోను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ అంశాలపై చర్చించారు.

వేల కోట్లు మింగేశారు..

కాకినాడ కేంద్రంగా రేషన్ బియ్యం విదేశాలకు కొన్నేళ్లుగా యథేచ్ఛగా తరలిపోతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులు మరింత బరితెగించారు. సీఎం జగన్‌కు సన్నిహితుడైన అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి తన సోదరుడు, అనుచరుల ద్వారా వేల కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని రేషన్ బియ్యంతో కలిపి విదేశాలకు ఎగుమతి చేసేవారు. గడచిన ఐదేళ్ల కాకినాడలోని యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టుల నుంచి ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం, ఆయన అనుచరులు లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని ఓడల్లో తరలించేశారు. రేషన్ బియ్యంతో పాటు పేదలకు రాష్ట్రప్రభుత్వం పౌష్టికాహారం కింద పంపిణీ చేసిన పోర్టిఫైడ్ బియ్యాన్ని సైతం పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేసింది. అక్రమార్కులకు బియ్యం వ్యాపారం రూ.లక్ష పెట్టుబడికి రూ.10లక్షల రాబడి సమకూరింది. వైసీపీ అధికారంలోకి రాకముందు కాకినాడ యాంక రేజ్ పోర్టు నుంచి మాత్రమే విదేశాలకు బియ్యం ఎగు మతి జరిగేది. ఆ సమయంలో 2018-2019లో ఏడాదికి పోర్టు ద్వారా 16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగు మతి అయ్యేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారిగా ఎగుమతులు రెట్టింపయ్యాయి. అదే సమ యంలో రేషన్ మాఫియా కోరలు చాచింది.అప్పటి సీఎం జగన్‌కు సన్నిహితుడైన కాకినాడ కీలకనేత ద్వారంపూడి తన మాఫియాను రెట్టింపు చేశాడు. దీంతో కాకినాడకు నిత్యం వేల లారీల్లో రేషన్ బియ్యం రహస్యంగా గోదాముల్లో చేరేది. అప్పటి పౌరసరఫరాల సంస్థ సైతం అక్రమార్కులకు సహకరించింది. ఈ విభాగం ద్వారంపూడి తండ్రి చేతుల్లో ఉండేది.అటు రాష్ట్ర మిల్లర్ల సంఘం కూడా సోద రుడి చేతుల్లో ఉంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా అనేక పెద్ద మిల్లులకు ఐదేళ్ల పాటు పని భారీగా పెరిగిపోయింది.వచ్చిన లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని సార్టెక్స్ మిల్లుల్లో పాలిష్ చేసి పేర్లు పెట్టి గోనెసంచుల్లో ప్యాకింగ్‌లు చేసి పోర్టుకు తరలించేవారు.కిలో రూ.10లకు కొనుగోలు చేసి రూ.70 చొప్పున విదేశాలకు ఎగుమతి చేసి కోట్లకు కోట్లు సంపాదించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా చెప్పిన లెక్క ల ప్రకారం వైసీపీ చివరి మూడేళ్లలో పోర్టు నుంచి రూ.48 వేల కోట్ల విలువైన కోటి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం విదేశాలకు తరలించింది. అంటే రేషన్ మాఫియా ఏ స్థాయిలో వేళ్లూనుకు పోయిందో అర్థం చేసుకోవచ్చు. ద్వారంపూడి సోదరుడు వీరభద్రారెడ్డి, ద్వారంపూడి అనుచరుడు వినోద్ అగర్వాల్ కంపెనీ సరళ, మరో రెండు కంపెనీలు ఐదేళ్లలో ఏకంగా రూ.4,990 కోట్లకు పైగా బియ్యాన్ని విదేశాలకు అమ్మేశాయి.

అక్రమాలకు ద్వారాలు తెరిచేశారిలా..

ఏడాది	పోర్టు పేరు	తరలింపు
2018-19	యాంకరేజీ	16 లక్షల మెట్రిక్ టన్నులు
2019-20	యాంకరేజీ	19 లక్షల మెట్రిక్ టన్నులు
2020-21	యాంకరేజీ	27 లక్షల మెట్రిక్ టన్నులు
2021-22	యాంకరేజీ	29 లక్షల మెట్రిక్ టన్నులు
2022-23	యాంకరేజీ	38 లక్షల మెట్రిక్ టన్నులు
2023-24	యాంకరేజీ	24 లక్షల మెట్రిక్ టన్నులు

దోపిడీ ఎంతలా జరిగిందో ఈ ఒక్క టేబుల్ చెప్పేస్తుంది. ఎందుకంటే 2018-19 అంటే గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం 16 లక్షల మెట్రిక్ టన్నులే పోర్టు కేంద్రంగా ఎగమతులు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చూశారా.. ఎగుమతులు అమాంతం పెరిగిపోయాయి.

- నాడు వైసీపీలో అక్రమార్కులు..
- రేషన్ బియ్యం స్మగ్లింగ్
- సీపోర్టులో వాటాల వశం
- రెండు అక్రమాలపై సిట్, సీఐడీ
- ప్రభుత్వం మారి..వెలుగులోకి దందా
- త్వరలో గుట్టువిప్పనున్న సిట్, సీఐడీ
- ఇప్పటికే సీ పోర్టులో దర్యాప్తు
- తాజాగా కలెక్టర్ల సదస్సులో చర్చ

జ..గన్ పెట్టి.. వాటాలు కొట్టేశారు..

కాకినాడలో ప్రైవేటు పోర్టు అయిన డీప్ వాటర్ పోర్టులో ప్రధాన వాటాదారుడు కేవీ రావు. ఇతన్ని గన్‌లు పెట్టి బెదిరించి ఏకంగా బలవంతంగా వాటాలు రాయించేసుకున్న వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతోంది.అప్పటి సీఎం జగన్ ఆదేశాలతో టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి ఈ బెదిరింపుల్లో పాల్గొనడం సంచలనం రేపుతోంది.ఈ పోర్టు నిర్వహణ కన్సార్టియంలో కేవీ రావుకు 41.12 శాతం వాటా కింద 2.15 కోట్ల షేర్లు ఉన్నాయి. దీంతో ఈయన సీఎండీగా ఉన్నారు. లాభాల్లో 22 శాతం వాటా కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.100 కోట్ల వరకు ఆదాయం చెల్లిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాకినాడ సీపోర్టుపై జగన్ కన్ను పడింది. దీని సంగతి తేల్చడానికి ఎంపీ మిథున్‌రెడ్డిని రంగంలోకి దించారు. ఈయన విజిలెన్స్ అధికారులతో పాటు తమకు అనుకూలమైన సంతానం అనే ఆడిట్ సంస్థను చెన్నై నుంచి రంగంలోకి దించారు. ఈ సంస్థ కొన్ని నెలల పాటు సీపోర్టులో రికార్డుల ఆడిట్ నిర్వహించి పలు లోపాలను సర్కారు పెద్ద సారుకు కావాల్సిన విధంగా గుర్తించింది. అంతర్గత ఆడిట్‌లో కేవీరావు రూ.994కోట్లు ప్రభుత్వానికి ఎగేసినట్టు లెక్కలు సృష్టించారు.ఈ నివేదికను చూపించి కేవీరావు మెడపై కత్తిపెట్టారు.అలా కేవీ రావు 41.12 శాతం వాటా బలవంతంగా లాగేసుకున్నారు.అందులో భాగంగా రూ.2,500 కోట్ల విలువైన తన వాటాకు కేవలం రూ.494 కోట్లు ఇచ్చి లాగేసుకున్నారని కేవీరావు ఇటీవల సీఐడీకి ఫిర్యాదు చేశారు.ఈ అరాచకం వెనుక ఉన్న విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డితో పాటు మరో ముగ్గురిపై సీఐడీ కేసు నమోదు చేసింది. అటు 'ఆంధ్రజ్యోతి' కథనాల నేపథ్యంలో వాటాల అంశంపై దర్యాప్తు చేసి అక్రమార్కులను అరెస్ట్ చేసేందుకు వీలుగా ప్రభుత్వం కదులుతోంది.సీఐడీకి విచారణ బాధ్యత అప్పగిం చడంతో ఇటీవల అధికారులు సీపోర్టుకు వచ్చి తనిఖీలు చేశారు. పూర్తిగా తీగలాగే ప్రయత్నం చేస్తున్నారు.



ఇటీవల పోర్టులో బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నాదెండ్ల, కలెక్టర్ షాన్‌మోహన్

ప్రభుత్వం మారింది..పట్టేశారు!


కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ బియ్యం మాఫియాపై ప్రత్యేక దృష్టిసారించింది. సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో స్వయంగా మంత్రి నాదెండ్ల కాకినాడకు వచ్చి పోర్టుతో సహా గోదాములన్నీ ఈ ఏడాది జూలైలో తనిఖీ చేశారు.రూ.157 కోట్ల విలువైన 50,647 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ల్యాబ్‌కు పంపడం ద్వారా 26,488 మెట్రిక్ టన్నులను రేషన్ బియ్యంగా గుర్తించారు.రేషన్ బియ్యం నేరుగా ప్యాకింగ్‌తో పోర్టుకు తరలిపోతుండడంతో కొత్తగా పోర్టు పరిసరాల్లో రేయింబవళ్లు పనిచేసేలా రెండు సమీకృత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి బియ్యం లారీని తనిఖీ చేసి శాంపిళ్లు సేకరించేలా నిఘా పెట్టారు.కానీ రేషన్ మాఫియా ఒత్తిళ్లతో రాత్రివేళ తనిఖీలు నిలిచిపోయాయి.ఈ నేపథ్యంలో స్టెల్లా నౌకలో బియ్యం లోడింగ్ చేస్తుండగా అందులో 640 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ గతనెల 27న గుర్తించారు. ఆ తర్వాత 29న పవన్‌కల్యాణ్ కాకినాడ వచ్చి నౌక వద్దకు వెళ్లి రేషన్‌బియ్యం ఉన్న షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు.అప్పటి నుంచి కాకినాడలో రేషన్ బియ్యం మాఫియాపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చ జరిగింది. అదే సమయంలో ఆంధ్రజ్యోతిలో వరుసగా పలు సంచలనాత్మక కథనాలు రావడంతో బియ్యం మాఫియాను తేల్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ త్వరలో కాకినాడలో దర్యాప్తు చేయనుంది.



ఎన్నికలు నేడే

సాగునీటి సంఘాలకు

- జిల్లాలో 81 నీటి సంఘాలకు ,15 డీసీలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- రైతుల్లో ఉత్సాహం
- పట్టు సాధించేందుకు ఆయా పార్టీల నేతల సమాయత్తం



పి.గన్నవరం/మండపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా జరుగుతున్న నీటి సంఘాల ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గ్రామ స్థాయిల్లో రైతు వర్గాల్లో పట్టుసాధించేందుకు ఆయా పార్టీల నేతలు సమాయత్తమవుతున్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. సాగునీటి సరఫరాలో కీలకపాత్ర వహించే సంఘాలకు నేతృత్వం వహించేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. ఎమ్మెల్యేలు, కూటమి నేతలు పదవుల పంపకాల్లో నిమగ్నమయ్యారు. స్థానిక నేతలు సైతం తమ బయోడేటాలను ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు అందించినట్టు సమాచారం.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2015లో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా పదవీ కాలం ముగిసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి సంఘాల ఉపయోగాన్ని గుర్తించి ఎన్నికల నిర్వహణకు సమయత్తమైంది. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత జరగబోయే నీటి సంఘాల ఎన్నికలపై రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వీటి మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధుల అంశాన్ని విస్మరించింది. ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులే బాధ్యత తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించి కాల్వల మరమ్మతులకు మొండిచేయి చూపింది. ఈ క్రమంలో నీటి సంఘాలు ఎన్నికలు పూర్తికాగానే వచ్చే నిధులతో సాగునీటి కాల్వలకు పూర్వవైభవం రానుంది.

నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల వేళ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. రాష్ట్ర అధినాయకత్వం సూచనల మేరకు ఆయా నియోజకవర్గాల్లో సమర్థవంతమైన అభ్యర్థులను బరిలో దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. పదవుల్లో 50శాతం టీడీపీకి, 50శాతం జనసేన, బీజేపీలకు ఇచ్చేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. టీసీ మెంబర్ల దగ్గర నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక వరకు ప్రతి అంశాన్నీ రాష్ట్ర నాయకత్వం పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తోంది. ఈ క్రమంలోనే క్షేత్ర స్థాయిలో ఎమ్మెల్యే దగ్గర నుంచి నియోజకవర్గ ముఖ్య నేతల వరకు ఎవరూ కూడా పొరపాట్లు జరక్కుండా అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు... పిగన్నవరం నియోజకవర్గంలోని 8 నీటి సంఘాల్లో నాలుగు టీడీపీ, మూడు జనసేన, ఒకటి బీజేపీకి కేటాయించారు. అదే తరహాలో అభ్యర్థులను కూడా ఎంపిక చేసుకున్నారు. ఇదే రీతిన అభ్యర్థుల జరిగితే జిల్లాలోని నీటి సంఘాలన్నీ దాదాపుగా ఏకగ్రీవమయ్యే అవకాశముంది. మరోవైపు పదవులను ఆశించిన వారితో పాటు వివిధ ప్రాంతాల నాయకులు నియోజకవర్గ ప్రధాన కేంద్రాలకు చేరుకోవడంతో పదవి దక్కని వారిని బుజ్జగించే పనిలో ఎమ్మెల్యే పడ్డారు. భంగపడ్డ వారికి మరో పదవి ఇచ్చే ఏర్పాటు చేస్తానని నచ్చచెప్తున్నట్టు తెలుస్తోంది.

ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాల పరిధిలో అమలాపురం, పి.గన్నవరం, బ్యాంక్ కెనాల్, గోదావరి ఈస్ట్రన్ మెయిన్ కెనాల్‌లు, మొత్తం నాలుగు ప్రధాన పంట కాల్వలు సుమారుగా 240 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వీటికి అనుసంధానంగా చానల్స్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి (ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలు) 15 డీసీలకు, 81 నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగుతాయి.

- ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. రైతు ఓటర్లు 9 గంటలలోపు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలి. 9 తర్వాత వచ్చిన వారిని అనుమతించారు.
- ఉదయం 9 నుంచి 9.15 గంటల వరకు సాగునీటి సంఘాల అవశ్యకత, ఏకగ్రీవ ఎన్నిక గురించి వివరిస్తారు. ఏకాభిప్రాయం కుదరని నేపథ్యంలో ఎంపికను చేతులు ఎత్తడం ద్వారా (లేదా) ఓటరు స్లిప్పుల ద్వారా తెలుసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.
- ఏకాభిప్రాయం కుదరని పక్షంలో ఉదయం 9.45 నుంచి 10.15 గంటల మధ్య నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఏకగ్రీవమైతే సరి. లేకపోతే ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- తెలుగులో అక్షర క్రమంలో ఓటర్ల తుది జాబితాను ఉదయం 10.15 నుంచి 10.30 గంటల వరకు, పరిశీలన. తుది జాబితా ప్రకటన జరుగుతుంది. ఎన్నిక అనివార్యమైతే ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఓటరు స్లిప్పులు వెంటనే లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు.
- మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు సమావేశమై 12 టీసీ మెంబర్లలో ఇద్దరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు.
- ఈ నెల 17న జిల్లావ్యాప్తంగా ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాల ఛైర్మన్లు, వారి పరిధిలోని 15 డీసీలను ఎన్నుకుంటారు.
- 20వ తేదీన సెంట్రల్, ఈస్టన్ డెల్టాల పరిధిలోని డీసీలు, ప్రాజెక్టు కమిటీల ఛైర్మన్లను ఎన్నుకుంటారు.
- టీసీ మెంబర్లు, అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహణపై మండల స్థాయిలో అధికారులు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. ఎన్నికల నియమావళిని వివరించి నిబంధనల మేరకు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.



పచ్చని మణిహారం.. కడియం!

సుమారు ఐదు వేల ఎకరాల్లో 1,600 పైగా నర్సరీలు

15 వేల రకాల పండ్ల, పూల మొక్కలు.. వేలాది మందికి ఉపాధి



లక్షా 30వేల విలువచేసే రావిచెట్టు

ఎటు చూసినా పచ్చని తివాచీలా పరుచుకున్న పసిడికాంతుల అందాలు.. ఏ వైపు చూసినా చిరుగాలులు వీచే మొక్కలు.. మరోవైపు అందాలు విరబూస్తూ ముద్దులొలికే పూల రమణీయతల కలబోత కడియం. దేశంలో ఏ ప్రాంతంలో ఉన్న చెట్టైనా, నీడనిచ్చే ప్లాంటైనా, చిన్నారులు ఆడుకునే, పెద్దలు సేదతీరే పార్కుల్లో ఉన్న హోయలొలికే, విరబూసే మొక్కలు అయినా టక్కున గుర్తుకువచ్చేది కడియం నర్సరీలే. ఎందుకంటే ఏటా 90 శాతం ఎగుమతులు ఇక్కడి నుంచే ఉంటాయి.



(ఆంధ్రజ్యోతి- కడియం)

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం అంటే తెలియని వారుండరు. ఇక్కడ కడియపు లంకలో నర్సరీలు తొలుత మొదలై, తర్వాత కడియం, వీరవరం, దామిరెడ్డిపల్లి, మురమండ, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, కడియపుసావరం, పొట్టిలంక, వేమగిరి గ్రామాలతోపాటు రాజానగరం, గండేపల్లి, ఆలమూరు, మండపేట మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఒక్క కడియం మండలంలోనే 5 వేల ఎకరాల్లో సుమారు 1,600 పైగా నర్సరీలు విస్తరించి ఉన్నాయి.

జూన్ నుంచి క్రయవిక్రయాలు

ప్రతి ఏడాది తొలకరి చినుకులు పడగానే మొక్కల సీజన్ ప్రారంభమవుతుంది. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిసా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, పాండిచ్చేరి, న్యూఢిల్లీ, బోపాల్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఈ ప్రాంతం నుంచి అక్టోబరు నెల వరకు రోజుకు సుమారు 50 నుంచి 100 లారీలు, మిగతా నెలల్లో రోజుకు సుమారు 20 లారీల మొక్కలు ఎగుమతి అవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రం మొక్కలు అమ్మకాలు పెద్దగా ఉండవు.

● **రూ. 10 మొక్క నుంచి...**

కడియం ప్రాంత నర్సరీలో రూ.10 కరివేపాకు మొక్క నుంచి రూ.వెయ్యి వరకు రకరకాల మొక్కలు లభ్యమవుతాయి. అలాగే రూ.2 వేల నుంచి రూ.15 వేల విలువచేసే మొక్కలతోపాటు మల్టీ ఫైకస్ (లక్షల రూపాయల విలువ చేసే మొక్కలు) కూడా లభిస్తాయి. ఇండోర్, ఔట్‌డోర్, పామ్స్, ఎవెన్యూ, ఆర్నమెంటల్, సెమిషేడ్, ఆక్వాటిక్ ప్లాంట్స్, కాక్టస్ ఫ్యామిలీ, జేడ్ ఫ్యామిలీ, ట్రోపరీస్, హెడ్జింగ్ ప్లాంట్స్ ఇలా వివిధ రకాలకు చెందిన మొక్కలు వాటిలో రకాలు, వాటిలో రంగులు ఇలా సుమారు 15 వేల రకాలు కడియం నర్సరీల్లోనే లభిస్తాయి. లిల్లీ, మందార, మల్లె, చామంతి, విరజాజి వంటి పూల రకాలు, మామిడి, సపోటా, బత్తాయి, నారింజ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, వంటి పండ్ల రకాలు, ఆగ్లోనిమా, స్పైడర్ లిల్లీ, ట్రావెలర్ పామ్స్, రాయల్‌పామ్, పాక్స్‌టైల్ పామ్, టెర్మినేలియా గ్రీన్, వైట్, బోగన్‌విలియా వైట్, రెడ్, మల్టి కలర్ వంటి రకాల మొక్కలు ఈ ప్రాంతంలోనే లభ్యమవుతాయి.



● **నర్సరీ రంగమే ఆధారం..**

నర్సరీ రంగాన్ని ఆధారం చేసుకుని మొక్కల రవాణా చేసే లారీల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, నర్సరీలో మొక్కల ఎగుమతి చేసే కార్మికులు, మొక్కల ప్యాకింగ్, నర్సరీల్లో కలుపుతీత, నీరు పెట్టడం వంటి పనులు చేసే మహిళా కూలీలు ఇలా అనేకమంది ఉపాధి పొందుతున్నారు.





పుష్పాలదరహో..

పూల కడియంలో పురివిప్పి నాట్యంచేస్తున్న సీజనల్ పుష్పాలు

కడియం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శీతగాలి తగలగానే రంగురంగుల పూలు, అందమైన హోయలు ఒలకబోస్తూ కనువిందు చేసే సుందర దృశ్యాలకు నెలవుగా మారింది పూల కడియం. శీతాకాలం రాగానే ఇక్కడుండే ప్రతీ మొక్క పూలతో పలకరించి పులకరిస్తోంది. వందలాది రకాల పూల మొక్కలు వివిధ రంగుల్లో విరబూస్తూ కాంతులీనుతాయి. సరికొత్త రకాల పూల సుగంధ పరిమళాలు వెదజల్లుతూ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి. మంచుబిందువు పడగానే ఆకులే పుష్పాలుగా మారే పాయించిటియాలు, అరచేతి పరిమాణంలో విచ్చుకుని ఔరా అనిపించే గ్లాడియేటర్‌లు, పాము పడగలా గాలికి స్వైర విహారం చేసే స్వాతోఫైలం, ఆంధోరియం పూల మొక్కలు మేరీగోల్డ్ బంతిపూలు, మినీ ఆస్టర్స్, బిగోనియాలు, వింకారోజియా, సాల్వియా, దయంతస్, డాలియాలు, లింక్‌రోజ్, జనీయా, ఆర్కిడ్స్ వంటి కోకొల్లలు మొక్కలు అందంగా విచ్చుకుని చూపరులను ఆకట్టుకుంటాయి. శీతాకాలం రాగానే కడియం పరిసర ప్రాంతాల్లో ఎటుచూసినా చక్కగా విచ్చుకున్న పూలమొక్కలు, గుంపులు గుంపులుగా అందంగా దర్శనమిస్తాయి. మనం ఒకటి, రెండు రకాల మొక్కలు చూస్తేనే అబ్బుర పడిపోతాం. అలాంటిది వందలాది రకాల మొక్కలు లక్షల సంఖ్యలో కొలువుతీరి కబుర్లాడుకుంటుంటే చూడ తరమా. అందుకే ధనుర్మాసం వచ్చిందంటే కడియం నర్సరీలన్నీ పర్యాటకులు, వనప్రియుల రాకతో కళకళలాడుతుంటుంది. దానికితోడు ఈ సీజనల్ పుష్పాల రాక కాలంలోనే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగలు రావడంతో కడియం నర్సరీలు పర్యాటకులతో కళకళలాడుతుంటాయి.



నర్సరీ రైతులు అక్టోబరు మాసం నుంచే ఈ సీజనల్ పుష్పాల మొక్కల తయారీలో నిమగ్నమవుతారు. మొక్కల తయారీతోపాటు వీటిని ఒకే క్రమంలో ఉంచి చూడముచ్చటగా తీర్చిదిద్దుతారు. ఇలా ఈ కాలంలో సీజనల్ పుష్పాలదే ప్రత్యేక స్థానంగా చెప్పవచ్చు.

రైల్వే కోర్టు పునఃప్రారంభం

- తొలి రోజు.. 666 కేసుల్లో తీర్పు
- తీరిన ఆరేళ్ల అవస్థలు
- నెలకోసారి ఇక్కడే విచారణ

రాజమహేంద్రవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైల్వే కేసుల్లో పోలీసులకు ఆరేళ్ల అవస్థలు గట్టెక్కాయి. రైల్వే క్యాంపు కోర్టును శుక్రవారం ఏడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్(రైల్వేకోర్టు) ఆర్‌వీ శర్మ పునఃప్రారంభించారు. రైల్వే నేరాలకు సంబంధించి రైల్వే రక్షకదళం(ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కేసులు బనాయిస్తుంటారు. వీటిని రైల్వేకోర్టులో విచారిస్తారు. రాజమహేంద్ర వరంలో రైల్వే క్యాంపు కోర్టు నిర్వహించి కేసులను విచారించడం జరిగేది. కానీ ఆరేళ్ల కిందట ఈ కోర్టును మూసేశారు. తర్వాత కరోనా విపత్తు రావడంతో కోర్టు నిర్వహణను పక్కన పెట్టేశారు. అప్పటి నుంచి ఇక్కడ నమోదు చేసిన కేసుల విచారణ విజయవాడ రైల్వేకోర్టులో చేపడుతున్నారు. దీంతో కేసుల విచారణలో జాప్యం చోటుచేసుకోగా.. కేసులసంఖ్య పేరుకుపోతూ ఉండేది. దీంతో రాజమహేంద్రవరంలోని రైల్వే క్యాంపు కోర్టును శుక్రవారం పునరుద్ధరించారు. సీనియర్ పీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మొక్కను నాటారు. తొలి రోజున నోపార్కింగ్, దివ్యాంగులకు, మహిళలకు ఉద్దేశించిన బోగీల్లో ఇతరులు ప్రయాణించడం, రైళ్లలో పొగతాగడం తదితర రైల్వే చట్టాలకు సంబంధించిన 666 కేసుల్లో తీర్పునిచ్చారు. నేరస్తులకు రూ.2.60లక్షల జరిమానాలు విధించారు. ప్రస్తుతం ఈ క్యాంపు కోర్టును నెలకోసారి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఎంఎస్ చౌహాన్, రైల్వే సీనియర్ పీపీ టి.మురళి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.సైదయ్య, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.



కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న మేజిస్ట్రేటు ఆర్‌వీ శర్మ

భగవంతుడిని పూజించడమంటే.. సేవ చేయడమే!

ఆత్మీయ సమావేశంలో చిన జీయర్‌స్వామి

రాజమహేంద్రవరంకల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భగవంతుడిని పూజించడమంటే.. ఈ విశ్వంలో ఉన్న అన్ని జీవులు, ప్రకృతికి సేవ చేయడమేనని త్రిదండి చిన్న జీయర్ స్వామి అన్నారు. గౌతమి ఘాట్‌వద్ద రంగధామం క్షేత్రం వికాస తరంగిణి ఆత్మీయ సమావేశంలో ఆయన అనుగ్రహ భాషణం చేశారు. మానవ కుటుంబ జీవనానికి మూలం మహిళలు.. దేశ భవిష్యత్‌కు ఆయువు పట్టు పిల్లలు.. దేశానికి కవచం యువత అన్నారు. ప్రజ్ఞ వికాస్,ఆరోగ్య వికాస్, యువ వికాస్, సంస్కార వికాస్ అను విభాగాల్లో సేవలందించాలన్నారు. ఆవులు,భూమికి, మానవ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయన్నారు. పండ్లు,పూలు కాచే మొక్కలను నాటి ఆరోగ్య సమాజాన్ని నిర్మాణం చేయాలని దిశా నిర్దేశం చేశారు. అహోబిల రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోనే చిన్న జీయర్‌స్వామి వికాస తరంగిణి ప్రారంభించారన్నారు. రాజమహేంద్రవరాన్ని కేంద్రంగా చేసుకుని తూర్పుగోదావరి జిల్లాలో జీయర్ స్వామి అనుయాయులుగా చక్కని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ యువ వికాస్ సమన్వయకర్త అలి కాని సత్య శివకుమార్ మాట్లాడుతూ 2025-26సంవత్సరానికిగాను సేవా రుచి కలిగిన ప్రతిఒక్కరూ 85200 34741, 9989032311 ఫోన్ నెంబర్లలో సంప్రదించి దరఖాస్తు పొందవచ్చన్నారు. వికాస తరంగిణిలో సేవ చేసేందుకు 10 గ్రామాల నుంచి విచ్చేసిన సభ్యులను అభినందించారు.



శ్రీరంగధామం క్షేత్రంలో మాట్లాడుతున్న చిన జీయర్ స్వామి

ఎన్నేళ్లు పడుతుందో?





- నత్తనడకన పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ
- ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యువల్‌గానే దస్త్రాల నిర్వహణ
- అక్రమాల అడ్డుకట్టకు డిజిటలైజేషన్ చేయాలని కేంద్రం నిర్ణయం
- ఆన్‌లైన్ పూర్తయితే ఎన్నో సమస్యలకు పరిష్కారం
- సహకార శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో జాప్యం

కాకినాడరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో డాక్యుమెంట్ల కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతోంది.ఈ ప్రక్రియ ప్రారంభించి నాలుగు నెలలు గడుస్తున్నా పూర్తికాలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే జాప్యానికి కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అక్రమాలు బయటపడతాయనేనా?

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 298 పీఏసీఎస్‌లుండగా, వాటిలో 2.50లక్షల మంది సభ్యులున్నారు. వాటన్నింటినీ కంప్యూటరీకరణ చేయాలని దానికి సంబంధించిన ప్రక్రియను ఆగస్టులోనే ప్రారంభించారు. ఇప్పటికీ 15 పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ నేటికీ పూర్తికాని పరిస్థితి. కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతోంది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే తమఅక్రమాలు బయటపడతాయనే భయంతోనే కొన్నిచోట్ల పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణను ఆలస్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

గతేడాదే మొదలు..

మొదటిగా ఈప్రక్రియను గతేడాది జూన్ 30లోపు, రెండోసారి ఈఏడాది అక్టోబరు 2లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించగా అప్పటికీ పూర్తి కాకపోవడంతో ఆ నెలాఖరు నాటికి కంప్యూటరీకరణను పూర్తిచేయాలని ఆదేశించారు. అయినా పూర్తికాలేదు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలన్నింటిలోనూ మాన్యువల్‌గానే దస్త్రాలు నిర్వహిస్తున్నారు. వాటిలో రుణాల మంజూరు నుంచి రికవరీ వరకూ అన్నీ సర్దుబాట్లతోనే సరిపెడుతున్నారు. ఈ క్రమంలో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసేందుకే లావాదేవీలను డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

పూర్తయితే రైతులకు మేలు

రుణాలు తీసుకున్న రైతులు చెల్లించిన వాయిదాలు, వడ్డీకి సంబంధించిన వివరాలు కావాలంటే రికార్డులన్నీ తిరగేయాల్సి వస్తోంది. ముఖ్యంగా భూముల వివరాలు, ఆధార్‌తో అనుసంధానం చేయడంతో సబ్సిడీ నేరుగా ఖాతాలోకి జమ అవుతుంది. దస్త్రాల్లో మాదిరిగా కొట్టివేతలకు అవకాశం లేకపోవడంతో సిబ్బంది అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అది నీరుగారిపోయింది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం డిజిటలైజేషన్ ద్వారా రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టింది.

రూ.100కోట్ల వరకూ లోన్ల రికవరీ కాలేదు

కాకినాడ జిల్లాలో 72 పీఏసీఎస్‌లుండగా వాటిలో 80,484 మంది సభ్యులున్నారు వాటిలోని 9 పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ ఇప్పటివరకూ జరగలేదు. జిల్లాలోని గండేపల్లి, లంపకలోవ, జగ్గంపేట, కిర్లంపూడి తదితర పీఏసీఎస్‌ల్లో జరిగిన అవకతవకల కారణంగా రూ.100కోట్ల వరకూ లోన్ల రికవరీ కాకపోవడం కంప్యూటరీకరణ జరిగితే వారు చేసిన అక్రమాలు, లోపాలు బయటకు వస్తాయని కావాలనే పైన పేర్కొన్న పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణను ముందుకు సాగనీయడం లేదని సమాచారం. ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించి ఏదైనా కార్యక్రమం చేద్దామంటే కంప్యూటరీకరణ పూర్తి కాకపోవడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

సాంకేతిక కారణాలవల్ల ఆలస్యం

పీఏసీఎస్‌ల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక కారణాలవల్ల ఈ ప్రక్రియ కొన్ని సంఘాల్లో ఆలస్యమవుతోంది. త్వరలో పూర్తవుతుంది.

-జి.వెంకటకృష్ణ, డీసీవో, కాకినాడ

గోదారిలో ఇసుక తోడేళ్లు

- బ్రిడ్జిల చెంత ఇసుక తవ్వుతున్న రెండు బోట్లు సీజ్
- ఇసుక ఓవర్‌లోడ్‌తో 5 లారీలకు అపరాధ రుసుం

కొవ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా గోదావరి వంతెనల మధ్యలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న 2 బోట్లను టాస్క్‌ఫోర్సు అధికారులు సీజ్‌చేసి కేసు నమోదుచేశారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి, హేవలాక్ బ్రిడ్జి (పాత రైలువంతెన)లవద్ద శుక్రవారం టాస్క్‌ఫోర్సు ఎస్‌ఐ జి.పరమేష్, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బ్రిడ్జిల మధ్య 300మీటర్ల దూరంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్న రెండు బోట్లను సీజ్ చేశారు. ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు ఫిర్యాదు మేరకు బోటు యజమానులపై పట్టణ ఎస్‌ఐ జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఇటీవల రాజమహేంద్ర వరం, కొవ్వూరు వైపు 20బోట్లను సీజ్‌చేసి బోటు యజమానులపై కేసు నమోదు చేశారు. ఇక నుంచి అలా చేస్తే కఠినచర్యలు ఉంటాయని జేసీ హెచ్చరించినా బోటు యజమానుల్లో మాత్రం మార్పురాలేదు. బ్రిడ్జిల మధ్య యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా బ్రిడ్జిల వద్ద ఇసుక తవ్వకాలు జరుపుతున్న బోట్లను సీజ్‌చేసిన టాస్క్‌ఫోర్సు అధికారులు

5 లారీలకు రూ.72,374 ఫైన్

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఓవర్‌లోడ్ వేసుకుని ఇసుక రవాణా చేస్తున్న 5 లారీలకు టాస్క్‌ఫోర్సు బృందం రూ.72,374లు అపరాధ రుసుములు విధించారు. కొవ్వూరు పట్టణం వాడపల్లి రోడ్‌లో ఎరినమ్మ ఇసుక ర్యాంపు వద్ద శుక్రవారం కొవ్వూరు సబ్ డివిజన్ శాండ్ టాస్క్‌ఫోర్సు బృందం కొవ్వూరు ఎంవీఐ కె. శివప్రసాద్, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, టాస్క్‌ఫోర్సు ఏఎస్‌ఐ జి.శ్రీనివాస్ ఇసుక లారీలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అదనపు లోడ్ చేసుకున్న 5 లారీలను గుర్తించి అపరాధ రుసుములు విధించినట్లు టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు.



ఓవర్‌లోడ్ ఇసుక లారీని పట్టుకున్న మైనింగ్ టీఏ శైలజ, ఏఎస్‌ఐ శ్రీనివాస్

జైలులో పరిచయాలు.. దొంగతనాలకు వ్యూహరచనలు!

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

రూ.24.65 లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం

కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు వెల్లడి

పోలీసు అధికారులకు రివార్డులు



దొంగల ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలను చూపిస్తున్న కోనసీమ జిల్లా ఎస్పీ, రివార్డు అందజేస్తున్న దృశ్యాలు

అమలాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు లోనై చిన్నతనం నుంచి చిన్న చిన్న చోరీలతో ప్రస్థానం ప్రారంభించిన దొంగలు అంతర్ జిల్లా స్థాయిలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో నేరాలకు పాల్పడిన ముగ్గురు సభ్యుల దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీబి.కృష్ణారావు శుక్రవారం సాయంత్రం అమలాపురంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 13 కేసులకు సంబంధించి రూ.24.65 లక్షల విలువైన 311 గ్రాముల బంగారం, 3.200 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన మండేల నాగభాస్కరావు అలియాస్ బాబి, ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందినబొడ్డు కిశోర్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన ముత్యాల పెద్దిరాజు అలియాస్ వీఆర్వో రాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారు కోనసీమ జిల్లా పరిధిలో 11 పోలీసుస్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారు. పశ్చిమ గోదావరిలో ఒకటి, కాకినాడ జిల్లాలో ఒక కేసు వెరసి 13 కేసుల్లో వారిని అరెస్టు చేశారు. ముఖ్యంగా ఆత్రేయపురం పోలీసుస్టేషన్ పరిధిలో 2 కేసులు, ఆలమూరు స్టేషన్ పరిధిలో 2, అంగరలో 1, అంబాజీపేట 1, అమలాపురం టౌన్ 1, సఖినేటిపల్లి, 1, కొత్తపేట 1, పి.గన్నవరం 1, కాకినాడ జిల్లా పరిధిలోని గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలో 1, పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట పోలీసుస్టేషన్ పరిధిలో ఒక కేసుల్లో వారిని అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒకడైన మండేల నాగభాస్కరరావు చిన్నతనం నుంచి వ్యసనాలకు లోనై దొంగతనాలకు పాల్పడడం ద్వారా అంతర్ జిల్లాల స్థాయిలో దొంగతనాలకు పాల్పడుతున్నట్టు ఎస్పీ తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రంలోఅతడిపై 40కు పైగా దొంగతనం కేసులు ఉన్నట్టు చెప్పారు. కేసులో మరో నిందితుడైన ముత్యాలపల్లి పెద్దిరాజు దొంగనోట్ల చెలామణి విషయంలో నర్సాపురం పోలీసుస్టేషన్‌లో అరెస్టు అయి 23 రోజులు జైలులో ఉండి బెయిల్‌పై వచ్చినట్టు తెలిపారు. బొడ్డు కిశోర్ అనే నిందితుడు అనతవరంలో అనిత అనే అమ్మాయిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు. వారి ముగ్గురు జైలులో పరిచయమై వరుస దొంగతనాలకు వ్యూహరచనలు చేసుకున్నట్టు చెప్పారు. ఈ చోరీ కేసులను చేధించడంలో విశేషంగా కృషి చేసిన ఎస్డీపీవో వై.గోవిందరావు, రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ రాము, క్రైమ్‌పార్టీ ఇన్‌చార్జి సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది విశేష కృషి చేసి నిందితులను లొల్ల లాకుల వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందికి ఎస్పీ రివార్డులను అందజేశారు. సమావేశంలో కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ రాము ఉన్నారు.

దొంగనోట్ల ముఠా అరెస్ట్

పోలీసులు అదుపులో 12 మంది సభ్యులు

రూ.లక్షా 33వేల విలువైన నోట్లు, ముద్రణ పరికరాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

వివరాలు వెల్లడించిన కోనసీమ జిల్లా ఎస్పీ



దొంగనోట్ల ముఠా వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు



స్వాధీనం చేసుకున్న దొంగనోట్ల ముద్రణా పరికాలు

అమలాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా దొంగనోట్లు భారీగా ముద్రిస్తూ చెలామణి చేస్తున్న పన్నెండు మంది సభ్యుల దొంగ నోట్ల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శుక్రవారం సాయంత్రం అమలాపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. దొంగల నోట్ల ముఠా నుంచి రూ.లక్షా 33వేల విలువైన దొంగనోట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు దొంగ నోట్ల తయారీకి ఉపయోగించే సాంకేతిక పరికరాలు, యంత్ర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజోలు కేంద్రంగా దొంగనోట్ల ముఠా నకిలీ నోట్లను చెలామణి చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తాటిపాక మఠం ప్రాంతానికి చెందిన కోళ్ల వీరవెంకట సత్యనారాయణ అనే పాస్టర్ యాక్సిస్ బ్యాంకు డిపాజిట్ నోట్‌లో రూ.500 నోట్లు 100 అంటే రూ.50వేలను డిపాజిట్ చేశారు. అయితే ఆ డిపాజిట్ సొమ్ము అంతా దొంగ నోట్లగా గుర్తించిన యాక్సిస్ బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెల 30వ తేదీన నమోదైన కేసుపై రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పాస్టర్ కోళ్ల సత్యనారాయణను విచారించగా దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు అవడంతో ఈ మొత్తం ముఠా నెట్‌వర్క్‌ను చేధించారు. నకిలీ కరెన్సీ రాకెట్‌ను నడిపించడంలో విభిన్న పాత్రలు పోషించిన 12 మందిని ఈ కేసులో అరెస్టు చేశారు. నకిలీ కరెన్సీ నోట్ల మూలాన్ని షేక్ మస్తాన్ నిర్వహిస్తున్న హనుమాన్ జంక్షన్ మండలం వీరవల్లి గ్రామంలోని ఎస్ఎంఎస్ ఇంటర్‌ప్రైజెస్ ద్వారా గుర్తించారు. నకిలీ కరెన్సీ నోట్లను ముద్రించడం, ఏజెంట్ల ద్వారా చెలామణి చేయడంలో వీరిపాత్ర కీలకంగా ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ 12 మందితో పాటు మరికొంత మంది ప్రమేయం ఉన్నట్టు తేలిందని వారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. పాస్టర్ సత్యనారాయణ అనపర్తికి చెందిన సత్తి వీరరాఘవరెడ్డితో ఏర్పరుచుకున్న పరిచయం ద్వారా నకిలీ నోట్లు చెలామణి జరుగుతున్నట్టు తెలిపారు. రాఘవరెడ్డి ఏజెంట్లుగా మారాయ్య, గోపీలను షేక్ మస్తాన్ నిర్వహిస్తున్న ఎస్ఎంఎస్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నోట్లను పొందారు.

అరెస్టయిన వారు...

ఈ కేసులో కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకకు చెందిన కోళ్ల వీరవెంకటసత్యనారాయణ (58), ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన పాశర్లపూడి వెంకటసత్యనారాయణ అలియాస్ సతీష్ (42), రాయవరం మండలం వెంటూరుకు చెందిన పట్టపగలు మారయ్య (36), రామచంద్రపురం పట్టణానికి చెందిన ఉత్తరాల హరిఅప్పారావు (40),మాగంటి గోపి (33), కపిలేశ్వరపురం మండలం శ్రీరామపురానికి చెందిన బొక్కా శ్రీనివాస్ (40), తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన సత్తి వీరరాఘవ అలియాస్‌రెడ్డి (67), కడియం మండలం వేమగిరికి చెందిన తుంపర దుర్గాప్రసాద్ (30), హనుమాన్ జంక్షన్ సమీపంలోని గన్నవరం మండలానికి చెందిన షేక్ మస్తాన్ అలియాస్ వర్మ (42), కృష్ణా జిల్లా వీరవల్లికి చెందిన షేక్ హనీఫ్ (33), కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం బొడ్డువెంకటాయపాలేనికి చెందిన కామేశ్వరరావు (40), పెదపూడికి చెందిన సుబ్బయ్య (42)ను అరెస్టు చేశారు.

అధికారులకు అభినందన

కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన కొత్తపేట డీఎస్పీ గోవిందరావు, సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, జిల్లా క్రైమ్ టీమ్ ఇన్‌చార్జి ప్రశాంత్‌కుమార్‌లతో పాటు సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులు అందజేశారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ చాంఫియన్‌షిప్‌కు ఎంపిక



శ్రావణి

పిఠాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళా బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం విద్యార్థిని ఎంపికైంది. పట్టణానికి చెందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి కేఎస్‌వీఎస్ శ్రావణి విజయవాడలోని మేరీ స్టెల్లా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. యూనివర్సిటీ పరిధిలో జరిగిన పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా కేరళలో ఈనెల 18 నుంచి 24వ తేది వరకూ జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేశారు. ఆమె గతంలో పిఠాపురంలో ఉండగా ఐదుసార్లు జాతీయ బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికైంది. ఆమెను పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, జిల్లా సభ్యులు కొత్తెం సుందర కుమార్, సంబూరు అర్జున, గరికపాటి దుర్గాప్రసాద్, బొజ్జా సతీష్ అభినందించారు.

తాటిపర్తిలో ముగిసిన షష్ఠి మహోత్సవాలు



స్వామివారికి శ్రీపుష్పయోగం దృశ్యం

గొల్లప్రోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 87వ షష్ఠి మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్వామికి సుబ్రహ్మణ్య షట్‌సహస్ర నామార్చన నిర్వహించారు. రాత్రి శ్రీపుష్పయోగం జరిగింది. ఊయలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి భక్తులు ఊయలసేవ జరిపారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు పూజాది కార్యక్రమాలు జరిపించగా ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామర్లకోటలో డిప్యూటీ స్పీకర్ సతీమణి పూజలు



పూజల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ సతీమణి

సామర్లకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమద్ వ్రత పర్వదినం పురస్కరించుకుని కాకినాడ జిల్లా సామర్లకోట కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం శుక్రవారం సామూహిక వ్రత పూజలు నిర్వహించారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు సతీమణి రమాదేవి ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం ఎదుట శుక్రవారం హనుమద్ వ్రత పూజలను నిర్వహించారు. రమాదేవికి కంచిమహాసంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు పతం జలి ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనంతోపాటు ప్రసాదాలు అందజేశారు.

దుర్గాడలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

4.40 మెట్రిక్ టన్నుల ఎరువులు, 9.25 లీటర్ల పురుగుమందుల స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని వెంకటేశ్వర ఏజెన్సీస్‌లో 4రోజులుగా జరిగిన విక్రయాలు, రికార్డులు, నిల్వలకు పొంతన లేకపోవడంతో షాపులో ఉన్న రూ.1.41లక్షలు విలువైన 4.40 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని 6(ఏ) కేసు నమోదు చేశారు. అదే విధంగా గంగా ట్రేడర్స్‌లో 9.25లీటర్ల వివిధ పురుగుమందులను సీజ్ చేశారు. విజిలెన్స్ ఎస్పీ స్నేహిత ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో సీఐ టి.నాగ వెంకటరాజు, ఏజీ లక్ష్మీనారాయణ, ఏఈ సుబ్రహ్మణ్యం, పీసీ వీరబాబు, తూనికలు కొలతలు శాఖ ఇనస్పెక్టర్ పి.సరోజీని, మండల వ్యవసాయాధికారి కేవీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.



దుర్గాడలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రతిభావంతులకు 'నన్నయ' చక్కని వేదిక

● రిజిస్ట్రార్ సుధాకర్ ● అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదిక అవుతుందని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయం విద్యకళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ క్రీడాకారుల వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల నుంచి హాజరైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి దృఢమైన విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అథ్లెటిక్స్‌లోని రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ వంటి 24 ఈవెంట్స్‌లో పురుషులకు, మహిళలకు పోటీలు జరుగుతాయని తెలిపారు. అనంతరం హాఫ్ మారథాన్(21 కిలోమీటర్లు) మహిళ పరుగు పందెంలో మొదటి మూడుస్థానాలు సాధించిన జి.పావని(ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం) ఎస్.సౌమ్యశిరీష(ఏఎస్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాకినాడ), బి.నాగ లక్ష్మిదుర్గ(ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం)లకు పతకాలు అందజేసి అభినందించారు. పురుషుల విభాగంలో మొదటి మూడు స్థానాలు సాధించిన బి.సురేష్ (ఎస్‌సీఐఎండీసీ, తణుకు)ఎ.మోహనకృష్ణ ప్రసాద్ (డీఎన్ఆర్ కళాశాల, భీమవరం) పి.సాయిరామ్(డిగ్రీ కళాశాల, భీమడోలు)కు పతకాలను అందజేసి అభినందించారు. అలాగే డిస్కస్ త్రో మహిళా విభాగంలో సీహెచ్ శోభారాణి (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం), ఎస్.శ్రీలక్ష్మీలావణ్య(నన్నయ విశ్వవిద్యాలయం) కె.శ్రీదేవి (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం) తొలి మూడు స్థానాల్లో నిలిచి పతకాలను అందుకున్నారు. తరువాత ఐదు వేల మీటర్లు వాకింగ్ రేస్ లో మహిళా విభాగంలో ప్రతిభ కనబరచిన వి.నాగలక్ష్మి, సీహెచ్.ఝూన్సీదుర్గ, ఎస్.పుష్పలతలకు పతకాలు ప్రదానం చేశారు. ఇరవై వేల మీటర్లు వాకింగ్ రేస్ పురుషుల విభాగంలో ప్రతిభ కనబరచిన బి.జీవన్‌కుమార్, యు.భీమయ్య, ఎన్.హేమసాయిలకు పతకాలు అందజేసి అభినందించారు. మిగిలిన క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పి.సురేష్‌వర్మ, ఎన్.ఉదయభాస్కర్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, కార్యనిర్వాహక చైర్మన్ కె.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చొల్లంగి వెంకట సుబ్రహ్మణ్యం, పరిశీలకులు సాల్మన్ దేవానంద్, వ్యాయామవిద్య అధ్యాపకులు బాలసత్యనారాయణ, బి.రామ్‌గోపాల్, ఫణీంద్ర, మూర్తి, డీఎన్ఆర్ కళాశాల పీడీ రాజు ఉన్నారు.



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న మహిళా క్రీడాకారులు

లభించని పెద్ద పులి ఆచూకీ



వేళంగి రిజర్వ్ ఫారెస్ట్‌లో గాలిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో 6రోజుల కిందట లేగదూడను చంపి కలకలం సృష్టించిన పెద్ద పులి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. లేగదూడను చంపి కొద్ది మాంసం తిని వెళ్లిన పెద్ద పులి మళ్లీ తిరిగి వస్తుందని ఆ ప్రదేశంలో అటవీశాఖాధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాకు చిక్కలేదు. పులి ఎక్కడ ఉంది? ఎటువైపు వెళ్లింది? అనే సందేహాలపై అటు అటవీశాఖాధికారులు, ఇటు సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనుల్లో చర్చనీయాంశంగా మారాయి. శుక్రవారం కూడా జిల్లా అటవీశాఖాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం

కొనసాగుతున్న గాలింపు

రేంజర్ కె.దుర్గారాంప్రసాద్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పులి సంచరించే అవకాశం ఉన్నప్రదేశాల్లో శిబిరాలు ఏర్పాటు చేసుకుని గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. వేళంగి, తాడువాయి, దోపర్తి రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు గ్రామాల్లో అటవీ సిబ్బంది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి కదలికలు కనిపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

అధికారుల అత్యవసర సమావేశం

నియోజకవర్గంలోని రిజర్వ్‌ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో ఏర్పాటు చేసే విద్యుత్ కంచెల వల్ల పెద్ద పులి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ముందు జాగ్రత్తగా అటవీ, విద్యుత్, పోలీస్ శాఖాధికారులు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అలాగే ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్ట్‌లో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలను తొలగించారు. బురదకోట అటవీప్రాంతంలో తిష్టవేసినట్టుగా భావిస్తున్న పెద్ద పులి సంరక్షణ అధికార యంత్రాంగానికి విద్యుత్ కంచెల ఉచ్చులతో సవాల్‌గా మారింది.

భార్యపై అనుమానం.. వ్యక్తిపై దాడి

ముగ్గురి అరెస్ట్

కిర్లంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం రావడంతో భర్త ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటనపై శుక్రవారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్ఐ సతీష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన సతీష్ తన భార్య మీద అనుమానం పెంచుకున్నాడు. ఆ గ్రామానికి చెందిన రమణపై కూడా అనుమానం పెంచుకుని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం సతీష్ అన్నయ్య రాజు, బావమరిది శివతో కలిసి మోటార్ బాగు చేయాలని రమణను బూరుగుపూడి అయ్యప్పస్వామి గుడి దాటిన తర్వాత పుంత రోడ్డులోకి తీసుకుని వెళ్లి దాడి చేశారు. రమణ తప్పించుకుని పారిపోయాడు. దీంతో రమణ మోటారుసైకిల్‌ను ఆ ముగ్గురు కలిసి పెట్రోల్ పోసి తగలబెట్టేశారు. దీనిపై ఫిర్యాదు రావడంతో ఎస్ఐ సతీష్ నిందితులను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు.



బూరుగుపూడి వద్ద పుంతరోడ్డులో తగలబెట్టిన బైక్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ

వివాహితను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

కిర్లంపూడి మండలం కృష్ణవరానికి చెందిన ఓ వివాహితను తన కోరిక తీర్చమని వేధిస్తున్న అదే గ్రామానికి చెందిన రమణను ఎస్ఐ సతీష్‌బాబు శుక్రవారం అరెస్టుచేసి కేసు నమోదు చేశారు. అతడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా 15రోజులరిమాండ్ విధించినట్టు తెలిపారు.

అధిక లాభాలు ఆశ చూపి టోకరా

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అధిక లాభాలు వస్తాయని ఎంఎన్‌కె కంపెనీలో పొదుపు చేయాలని భార్యభర్తలు పలువురిని నమ్మించి మోసగించిన వైనంపై రామచంద్రపురం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ముచ్చిమిల్లి రోడ్డులో సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న స్వామికన్ను శశికుమార్‌తో అదే ప్రాంతంలో ఉండే మత్తాల నవీన్‌కుమార్, మత్తాల సాయి పల్లవి పరిచయం పెంచుకున్నారు. ఎంఎన్‌కె ట్రేడింగ్ అడ్వయిజరీ కంపెనీలో పెట్టుబడి పెడితో అధిక లాభాలు వస్తాయని శశికుమార్‌ను నమ్మించి ప్రోత్సహించారు. దీంతో శశికుమార్ రూ.లక్ష ఇన్వెస్ట్ చేయగా నెలలో రూ.25 వేలు లాభం వచ్చింది. ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితో మరింత లాభాలు వస్తాయని నమ్మించారు.

భార్యభర్తలపై కేసు నమోదు

దీంతో శశికుమార్ మిత్రులు, బంధువులకు తెలిపి వారి వద్ద నుంచి సొమ్ము తీసుకుని కంపెనీలో పెట్టుబడి పెట్టాడు. సాయికుమార్‌తో పాటు 14 మంది కంపెనీలో ఉద్యోగులుగా చేరి ఇతరులను కూడా ప్రోత్సహించారు. శశికుమార్ రూ.కోటి వరకు, మిగిలిన 14 మంది కూడా పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టారు. అయితే నవీన్‌కుమార్, సాయిపల్లవి గత 6 నెలలుగా వారికి వేతనాలు, లాభాలు చెల్లించడం లేదు. డబ్బులు విషయంపై అడుగగా 10 రోజుల నుంచి వాయిదాలు వేస్తున్నారు. ఇటీవల ఎటువంటి సమాచారం లేకుండా ఇల్లు వదిలి పోయినట్టు పోలీసులకు శశికుమార్ ఫిర్యాదు చేశాడు. తమను నమ్మించి మోసగించిన ఆ జంటపై చర్యలు తీసుకోవాలని కోరాడు. రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

12న ఉమ్మడి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీలు

కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు

అమలాపురం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 12న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో శుక్రవారం పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కోనసీమ బాడీబిల్డింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు వివరించారు. జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి సుమారు 250మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ పోటీలను 4 విభాగాలుగా పది కేటగిరీల్లో నిర్వహిస్తామని తెలిపారు. మెన్స్ 55కిలోలు, 60, 65, 70, 75, 75కిలోలు పైబడిన విభాగంలోను, మాస్టర్స్ దివ్యాంగులు విభాగంలో, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీలను వేర్వేరుగా నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు షీల్డులు, మెడల్స్ అందజేస్తామన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

నేడు ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల న్యాయస్థానాల్లో జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి కేసులు పరిష్కరిస్తామన్నారు.

నేడు భీమేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు

ద్రాక్షారామ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి జన్మనక్షత్రపూజలు శనివారం జరుగనున్నాయి. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, మేలుకొలుపు, ఉదయం 5 గంటలకు తీర్థపు బిందె, ప్రాతఃకాల అర్చన జరుపుతారు. అనంతరం మంత్రి సుభాష్‌తో సంకల్పం తర్వాత గణపతిపూజ, మహాన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం తదుపరి స్వామివారికి లక్షపత్రిపూజ, మాణిక్యాంబ అమ్మవారికి లక్షకుంకుపూజ నిర్వహిస్తారు. అనంతరం నందివాహనంపై నగరోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం మహా నివేదన, సాయంత్రం సోమవార మండపంలో ప్రదోషకాలార్చన నిర్వహిస్తారు. రాత్రి 9.30 గంటలకు నీరాజన మంత్ర పుష్పములు సమర్పిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరుగుతుందని అధికారులు తెలిపారు.

16న జాబ్ మేళా

కాకినాడ సిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న కాకినాడ వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో వివిధ కంపెనీల టీమ్ లీడర్, ఎగ్జిక్యూటివ్ సేల్స్ అడ్వయిజర్, రిటైల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 30ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సరిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. 77993 76111లో సంప్రదించాలని కోరారు.

ఆదివారం కూడా వందేభారత్ ఎక్స్‌ప్రెస్

సామర్లకోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ-సికింద్రాబాద్ మధ్య సామర్లకోట మీదుగా ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును డిసెంబరు 15 నుంచి ఆదివారం కూడా నడుపనున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ఆదేశాలు జారీ చేశారు.

20833 నంబరు గల విశాఖ- సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ఆదివారం ఉదయం 5.45 గంటలకు బయలుదేరి సామర్లకోటకు 7.13 గంటలకు, రాజమహేంద్రవరానికి 7.53 గంటలకు, విజయవాడకు 9.50 గంటలకు, ఖమ్మం 11.00 గంటలకు, వరంగల్‌కు 12.05 గంటలకు, సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 2.15 గంటలకు చేరుకుంటుంది.

20834 నంబరు గల సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో ఆదివారం సాయంత్రం 3 గంటలకు బయలుదేరి వరంగల్‌కు 4.35 గంటలకు, ఖమ్మం 5.45 గంటలకు, విజయవాడకు రాత్రి 7 గంటలకు, రాజ మహేంద్రవరానికి 8.53 గంటలకు, సామర్లకోటకు 9.33 గంటలకు, విశాఖకు రాత్రి 11.35 గంటలకు చేరుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు
అంబాజీపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జయంతినగర్‌కు చెందిన జల్లి జయరాజు, కోట నాగేంద్రలు మోటార్‌సైకిల్‌పై స్థానిక సెంటర్ నుంచి ఇంటికి వెళ్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. గాయపడిన వీరిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

క్రిస్మస్‌కు ఆహ్వానం
కాట్రేనికోన, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల16న నిర్వహించే ఐక్యగ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు అందరూ హాజరు కావాలని కమిటీ మండల అధ్యక్షుడు అంబటి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం పక్కన ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం



యానాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఉన్న హనుమాన్ ఆలయాల్లో హనుమద్వ్రత మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యానాం శివారు దొమ్మేటిపేటలో శ్రీకనదుర్గాదేవి ఆలయం ప్రాంగణంలో కొలువైఉన్న శ్రీఅభయ అంజనేయస్వామి ఆలయంలో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూజలు నిర్వహించారు. యానాం శివాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం హనుమద్ వ్రతం, సంకల్పం, విశ్వక్సేనపూజ, మధ్యాహ్నం లక్ష తామలాపత్ర, నిమ్మఫల, గంగసింధూర, పూజ తర్పణాలు, పుర్ణాహూతి ఆలయ అర్చకులు పెందింటి వినోదాచార్యులు నేతృత్వంలో నిర్వహించారు.

హనుమద్వ్రత పూజలు
అమలాపురంటౌన్,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యర్రమిల్లివారి వీధిలో వేంచేసియున్న సకల కార్యసిద్ధి మరకత హనుమాన్ మందిరం వద్ద హనుమద్వ్రత పూజా మహోత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి హనుమద్వ్రత కథ ప్రవచనం చేశారు. అనంతరం లక్ష తులసి, సింధూర నాగవల్లీదళ పూజలు, హనుమత్ కల్యాణం జరిపించారు. సుందరకాండ పారాయణం చేశారు. ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, కిమ్స్ ఏవో రఘు, కుడుపూడి భరత్, కుడుపూడి శాంతిభూషణం పాల్గొన్నారు.

ఆలయాల వద్ద హనుమద్వ్రతాలు
మామిడికుదురు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమద్వ్రతాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెదపట్నం, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల వద్ద గంధసింధూరం, తమలపాకులతో అభిషేకం తదితరపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మాలల మహాగర్జనకు ప్రభుత్వం అడ్డంకులు

మాజీ ఎంపీ హర్షకుమార్

అమలాపురం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాలలకు జరిగిన అన్యాయాన్ని పార్లమెంటు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈనెల15న చేపట్టిన మాలల మహా గర్జనకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డంకులు కల్పిస్తోందని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. 'హలో మాల.. చలో గుంటూరు' సభకు కనీసం ఆర్టీసీ బస్సులు కూడా ఇవ్వట్లేదని ధ్వజమెత్తారు. మేము ఏ రాజకీయ పార్టీకీ వ్యతిరేకంగా కాదు. మాలల ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా మహాగర్జన ఏర్పాటు చేశామన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జిల్లా స్థాయి మాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మహా గర్జనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఆర్టికల్ 341ని సుప్రీంకోర్టు ఏవిధంగా వినియోగిస్తోందని ప్రశ్నించారు. పార్లమెంటులో జరగాల్సిన చర్చను సుప్రీంకోర్టు తీర్పుగా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పాలకుల కుట్రపూరితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని ధ్వజమెత్తారు. ఉత్తరాది రాష్ట్రాల్లో మాదిగ వర్గాలకు చెందిన మాయావతి, అథవాలె, పాశ్వాన్ వంటి నాయకులు సైతం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకత ప్రకటించారని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఇంకా మనువాద సంస్కృతి నడుస్తోందన్నారు. మాలమహానాడు నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు డీబీ లోక్, జంగా బాబూరావు, గెడ్డం సురేష్‌బాబు, పొలమూరి మోహన్‌బాబు, రేవు తిరుపతిరావు, పెనుమాల చిట్టిబాబు, నెల్లి లక్ష్మీపతి, కప్పల శ్రీధర్, ఉంద్రు ఆశీర్వాదం పాల్గొన్నారు.



అమలాపురంలో మాల నాయకుల సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

మాలల మహాగర్జనకు పిలుపు
ఉప్పలగుప్తం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆదివారం జరిగే మాలలమహాగర్జనను విజయవంతం చెయ్యాలని మాలల సమావేశం పిలుపునిచ్చింది. శుక్రవారం ఉప్పలగుప్తంలో దళిత సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పలు తీర్మానాలను ఆమోదించారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్‌బాబు, గెడ్డం సురేష్‌బాబు, యాళ్ల లక్ష్మీనారాయణ, కొంకి వెంకటబాబ్జీ, జంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోతులు పూడ్చేందుకు రూ.70లక్షలా?



అధ్వానంగా ఉన్న అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారి

భగ్గుమంటున్న ఏడు గ్రామాల ప్రజలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారిలో అమలాపురం ఎర్రవంతెన నుంచి చల్లపల్లి వినాయకుని ఆలయం వరకు ఉన్న గోతులు పూడ్చేందుకు రూ.70లక్షలు వ్యయం చేస్తున్నట్టు ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. దీనిపై చల్లపల్లి వరకు ఉన్న ఏడు గ్రామాల ప్రజలు భగ్గుమంటున్నారు. ఆర్అండ్‌బీ రహదారిని ఆధునీకరించాలంటూ చాలాకాలంగా ఆందోళన చేస్తున్న సంగతి బహిరంగ రహస్యమే. ఈరహదారి నిర్వహణ బాధ్యత ఓఎన్జీసీ, ఎస్.యానాం రవ్వ యాజమాన్యానిదేనని జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అమలాపురం-ఎస్.యానాం ఆర్అండ్‌బీ రహదారి ఓఎన్జీసీ, రవ్వ ప్లాంటులకు వ్యాపారపరంగా గుండెకాయ వంటిదన్నారు. భారీ యంత్రాలు, చమురు ట్యాంకర్లు నిత్యం ఈరహదారిలో రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. గతంలో ఈరహదారి పరిధి గ్రామాల ప్రజల ఉద్యమ ఫలితంగా రహదారి నిర్వహణ బాధ్యతను చమురు కంపెనీలు తీసుకుని ఏటా కొంత సొమ్ము కేటాయించి అవసరమైనప్పుడు రహదారిని ఆధునీకరించడం జరిగేదన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ సొంత పెత్తనంతో రోడ్డు పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చిందన్నారు. చాలాకాలంగా రోడ్డును పట్టించుకోకపోవడంతో గోతుల్లో కారణంగా ప్రమాదాలు జరిగి పలువురు తీవ్రగాయాలపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు 70లక్షలతో రహదారిలో గోతులు పూడుస్తామని, చల్లపల్లి గ్రామంలో రహదారిని ఆధునికీకరిస్తామని ఆర్అండ్‌బీ ఎస్ఈ చెప్పినట్టు రఘుబాబు వివరించారు. గోతులు పూడ్చడం తమ ప్రాంతాల ప్రజలకు ఆమోదయోగ్యం కాదని, దీనిపై ఆందోళన చేసేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకోవాలి
రాజోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణతా శాతం పెంచాలని రాజోలు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి కోరారు. శుక్రవారం కళాశాలలో 'సంకల్పం-25' ప్రోగ్రాం ఏర్పాటుచేసి సెకండ్, థర్డ్ గ్రేడ్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అధ్యాపకులు కె.గణేశ్వరరావు, పి.నరసింహరాజు, ఎం.అంబేద్కర్, పి.శ్రీనివాసరావు, బీఎస్ నరసింహారావు,డాక్టర్ పి.కుమారరాజు, డి.నాగమణి, ఎం.అరుంధతి, సీహెచ్‌హెచ్‌వీప్రసాద్, ఎస్.శాంతిశ్రీ, ఎన్ఎస్ఎస్ పీవో జె.రాజబాబు పాల్గొన్నారు.

రేపు పీఆర్టీయూ జిల్లా విద్యా సదస్సు
మామిడికుదురు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పీఆర్టీయూ జిల్లా విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధానకార్యదర్శి వాడ్రేవు శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో ప్రస్తుతం విద్యా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై విద్యా సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్కే సలీంబాషా, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు
పి.గన్నవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నాగుల్లంక శివారు పెదకందాలపాలెం నూతన యేరుషలేము ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. సంస్థ అధినేత జి.దానియేలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సంస్థ అధినేత జి.దానియేలు దంపతులను మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరిదేవి, కొండేటి చిట్టిబాబులు దుశ్శాలువాతో సన్మానించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, బిషప్ వై.శరత్ భూషణం, కె.శాంపాల్, సామ్యూల్‌సుకుమార్, లాజరస్‌జోసఫ్, పురుసోత్తం, పీపీఎఫ్ పాస్టర్లు జె.కరుణకుమార్, యు.జాన్‌బాబు, ఎన్.చరణ్ పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్
ముమ్మిడివరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అయినాపురం పంచాయతీ పరిధిలోని చిట్టివారిచెరువులో శుక్రవారం సాపే నాగేశ్వరరావుకు చెందిన ఇంట్లోకి తాచుపాము ప్రవేశించి హల్‌చల్ చేసింది. దీంతో వారు, చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పామును బంధించి తీసుకునివెళ్లాడు. అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్టు పేర్కొన్నాడు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

వైసీపీ నేతల కలెక్టరేట్ ముట్టడి
డిమాండ్లతో వినతిపత్రం అందజేత

అమలాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందిందని ఆరోపిస్తూ వైసీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు కొద్దిసేపు నిరసన ధర్నా నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నాయకత్వంలో ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ సతీష్‌కుమార్, పాముల రాజేశ్వరీదేవి, నేతలు పిల్లి సూర్యప్రకాష్, కొప్పూరి త్రినాథరెడ్డి, పితాని బాలకృష్ణ, జిన్నూరి బాబి, పినిపే శ్రీకాంత్ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం విశ్వరూప్ ఆధ్వర్యంలో నేతలు కలెక్టరేట్‌లోకి వెళ్లి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో మదన్‌మోహన్‌రావుకు అందజేశారు. అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత్‌భూషణ్, కాశి బాలమునికుమారి, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, కుడుపూడి భాగ్యలక్ష్మిబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, పొగాకు శ్రీను, కుంపట్ల నాయుడు, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

స్కేటింగ్‌పోటీల్లో హన్షిత ప్రతిభ
అంబాజీపేట, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఈనెల5 నుంచి 12వరకు జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ 2024 పోటీలు నిర్వహించారు. 5నుంచి 7ఏళ్ల బాలుర స్కేటింగ్ పోటీల్లో ఇసుకపూడి శివారు పిండిపేటకు చెందిన ఆరేళ్ల బాలుడు కుంచే హన్షిత్ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడని తల్లిదండ్రులు కుంచే రమేష్, శ్వేత తెలిపారు. బాలుడ్ని పలువురు అభినందించారు.

మోహన్‌బాబును అరెస్టు చేయాలని జర్నలిస్టుల ఆందోళన



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన కేసులో సినీ నటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ అమలాపురం ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టులు శుక్రవారం ఆందోళన చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి మోహన్‌బాబును అరెస్టు చేయాలని కలెక్టరేట్ ఎదుట నినాదాలిచ్చారు. అనంతరం డీఆర్వోకు ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బషీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు టీకేవిశ్వనాథ్, కొర్లపాటి ప్రదీప్, ఎ.వెంకట్, నిమ్మకాయల సతీష్, చొల్లంగి శేఖర్, వెంకటేష్, సుధీర్, రంకిరెడ్డి కృష్ణ, విజయ్, ముక్కామల చక్రధర్, ఆసుభరత్, దొమ్మేటి వెంకట్, పరమట భీమామహేష్, త్రిమూర్తులు, పొట్టుపోతు నాగు పాల్గొన్నారు.

జర్నలిస్టు సంఘాల నిరసన
ముమ్మిడివరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మీడియా కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరంలోని జర్నలిస్టు సంఘాలు ధర్నా చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట సినీ నటుడు మోహన్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్‌కు, ఎస్ఐకు డి.జ్వాలాసాగర్‌లకు వినతిపత్రాలు అందించారు. కాశివానితూము సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. జనసేన పార్టీ నాయకుడు గుద్దటి జమ్మి సంఘీభావం తెలిపి జర్నలిస్టుపై మోహన్‌బాబు దాడి చేయడం అమానుష చర్యగా పేర్కొన్నారు. పలువురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊటుకూరికి అభినందన
మలికిపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాంగ సంఘ అధ్యక్షుడిగా ఎంపికైన బండారులంకకు చెందిన ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన దేవాంగ సంఘ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సంఘీయుల అభివృద్ధికి పాటుపడాలని కోరినట్టు డీసీసీబీ మాజీ డైరెక్టర్, దేవాంగ సంఘ నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు మలికిపురంలో తెలిపారు. కోనసీమ దేవాంగ సంఘ ఉపాధ్యక్షుడు కటకం ధనలక్ష్మీశ్వరరావు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు అభినందించిన వారిలో ఉన్నారు.

ఎయిడ్స్ నివారణే లక్ష్యంగా సాగాలి
అమలాపురంటౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి):ఎయిడ్స్ నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు అన్నారు. హెచ్ఐవీ బాధితులకు అండగా ఉండాలన్నారు. జిల్లాఎయిడ్స్ కంట్రోల్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎయిడ్స్‌దేవక్షోత్సవాలను పురస్కరించుకుని హెచ్ఐవీ బాధితులకు దాతలు సమకూర్చిన దుప్పట్లు, చీరలను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి, డాక్టర్ అనూష శుక్రవారం పంపిణీ చేశారు. దాతలు చందన బ్రదర్స్ సౌతిండియా షాపింగ్‌మాల్, వలవల శివరావులను అభినందించారు. జల్లి సుజాత, లింగోలు పండు, నల్లా రాంబాబు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ వివాదాలు పరిష్కారం



గ్రామస్తుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూవివాదాలను పూర్తిస్థాయిలో పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా అందరూ శాంతియుతంగా జీవించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. కామనగరువులో సర్పంచ్ నక్కా అరుణకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి పలు అర్జీలను జేసీ స్వీకరించారు. ప్రధానంగా గ్రామంలో డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని, శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా సాగేలా ఏర్పాట్లు చూడాలని అర్జీలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, తహసీల్దారు జీడీ కిశోర్‌బాబు, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, పర్తంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమద్వ్రత మహోత్సవం
ముమ్మిడివరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీహనుమద్వ్రత మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చిరంజీవాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పుణ్యాహవచనం, విష్వక్సేనపూజ, పంచామృత మండపారాధన, కుంభపూజ, పంచామృత సహిత సమరస ఫలాభిషేకం, అలంకార సేవ, తమలపాకుల పూజ, సింధూరార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణం, హనుమద్ చాలీసా పారాయణం వంటివి ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సాయంత్రం ఓపీ సేవలు
యానాం,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఈనెల16వతేదీ సాయంత్రం 5నుంచి 7.30గంటల వరకు ఓపీసేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని డాక్టర్ టి.రవిశంకర్ తెలిపారు.

కూచిపూడి నృత్యానికి ప్రథమస్థానం
అల్లవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో రామాయణం ఇతివృత్తంగా జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌లో సాంస్కృతిక విభాగంలో జరిగిన కూచిపూడి నృత్యానికి ఆదుర్తి లక్ష్మీసుస్మిత గ్రూపు ప్రథమ స్థానంలో నిలిచింది. కూచి పూడి నృత్యం ఆహూతుల ప్రశంసలు అదుకుంది.

జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో ప్రతిభ
అమలాపురం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచినట్టు కార్యదర్శి కేవీఆర్ఎస్ నరసింహారావు తెలిపారు. ఏఎల్ సుస్మిత, ఎస్.భవానీ, జి.తులసి క్లాసికల్ గ్రూపు డ్యాన్స్ ఈవెంట్‌లో ప్రథమస్థానం, ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో ఎస్.అన్వర్ ప్రథమ స్థానం సాధించారు. వీరితో పాటు మరి కొందరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. శుక్రవారం కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో విజేతలను చైర్‌పర్సన్ మల్లిపూడి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్, సీనియర్ అధ్యాపకుడు వై.వరప్రసాద్, ఎస్.సంసోను, సీహెచ్ జాన్‌పాల్, కరాటం ప్రవీణ్ అభినందించారు.

పూర్వ విద్యార్థులు రూ.1.05లక్షల సాయం
అమలాపురంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బండారులంకకు చెందిన జనసేన చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి బట్టు నాగమల్లేశ్వరరావు (పండు) ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందగా ఆ కుటుంబానికి పూర్వ విద్యార్థులు సాయం అందించారు. బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాల 1994-95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.1,05,500 సమకూర్చి పండు కుటుంబ సభ్యుల పేరిట డిపాజిట్ చేసి పత్రాలను శుక్రవారం అందజేశారు. పండు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని పూర్వ మిత్రులు భరోసా కల్పించారు.

నేడు మెగా లోక్ అదాలత్
అమలాపురంటౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): అమలాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. మొదటిసారి మద్యం కేసుల్లో ఉన్న కక్షిదారులు కోర్టుకు హాజరై అపరాధ రుసుం ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించి కేసులు ఉపసంహరించుకోవాలని సీఐ సూచించారు.

శ్రీసిద్ధివినాయకుడి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి
అయినవిల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుని ఆలయ ప్రతిష్ఠ పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం శ్రీసిద్ధివినాయక దేవస్థానంలో స్వామివారి నూతన సంవత్సరం 2025క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా ఎమ్మెల్యే సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, మండల జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, సర్పంచ్‌లు కాకర శ్రీనివాస్, సలాది బుచ్చిరాజు, దంగేటి వెంకటరమణ, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

బాలిక కడుపులో కిలోన్నర జుట్టు: శస్త్రచికిత్సతో తొలగింపు
అమలాపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం బట్టుపాలెం గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలిక కడుపు నొప్పితో బాధపడుతుంటే తల్లిదండ్రులు అమలాపురం సమీపంలోని సాయివిశ్వాస్ ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్ గంధం విశ్వనాథ్ బాలికకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ ద్వారా పొట్టలో జుట్టు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే సర్జరీచేసి ఆమె కడుపులో ఉన్న కిలోన్నర జుట్టును తొలగించారు. మూడేళ్లుగా బాలిక తన జుట్టు తానే తింటూ వింత అలవాటు చేసుకుంది. జుట్టు తినడం ప్రారంభించిన నాటి నుంచి తరచుగా బాలికకు వాంతులు అవుతుండడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యులతో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో శస్త్ర చికిత్స ద్వారా కిలోన్నర జుట్టును తొలగించారు.

ప్రతీ సమస్యను పరిష్కరిస్తాం
పి.గన్నవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో రైతులు నుంచి స్వీకరించిన ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. లంకలగన్నవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక డొక్కా సీతమ్మకాలనీలో ఆమె పర్యటించి స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నారు. కాలనీలో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించాలని తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలోని ఇళ్ల స్థలాలు చేతులు మారడంతో పట్టాలు మాపేరుపై లేవని పలువురు ఆమెకు వివరించారు. సంబంధిత సమస్యను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, ఆర్ఐ వర్మ, వీఆర్‌వో దేవదాసు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
రాజోలు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు కోరారు. కడలి పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 47, రేషన్‌కార్డుల కోసం 108, గృహ నిర్మాణం కోసం 19, పెన్షన్ల కోసం 123.... మొత్తం 297 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సర్పంచ్ చొప్పల గుణనాథ్, డిప్యూటీ తహసీల్దారు సీఎస్ రాజు, సెక్రటరీలు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అర్జీ రసీదు కోసం వాగ్వివాదం
అల్లవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రులో తహసీల్దారు వీవీఎల్ నరసింహరావు పర్యవేక్షణలో ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కొందరు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. బోడసకుర్రు పల్లిపాలెం గ్రామకంఠం భూమి విషయమై ఇచ్చిన అర్జీకి రసీదు ఇవ్వాలని గ్రామస్తులు పట్టుబట్టారు. ఈవిషయాన్ని తహసీల్దారు నరసింహరావు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం జేసీ ఆదేశాలపై పంచాయతీ కార్యదర్శిని ఆ అర్జీకి రశీదు ఇవ్వాలని సూచించారు. రెవెన్యూ సదస్సుకు 26అర్జీలు వచ్చాయి. మత్స్య, ఇరిగేషన్, వైద్య శాఖాధికారులు సదస్సుకు గైర్హాజరయ్యారని బీజేపీ నాయకుడు అడపా శ్రీనివాసరావు ఆరోపించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు
అంబాజీపేట, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీరమణ అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో తహశీల్దారు జె.వెంకటేశ్వరి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో 54అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు తెలిపారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆర్ఐ కె.ఏడుకొండలు, ఎం.ఎం.శెట్టి, చిటావఝుల సూర్యరావు, ఉపసర్పంచ్ బందన రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి, వీఆర్వోలు రమణ, నాగలక్ష్మి, సరేయర్లు పాల్గొన్నారు.

మోరిపోడులో రెవెన్యూ సదస్సు
అంతర్వేది, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మోరిపోడులో తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు భాస్కర్, ఆర్ఐ రామరాజు, సర్వేయర్ భద్రరాజు, సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, ఎంపీటీసీ బళ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్
ముమ్మిడివరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అయినాపురం పంచాయతీ పరిధిలోని చిట్టివారిచెరువులో శుక్రవారం సాపే నాగేశ్వరరావుకు చెందిన ఇంట్లోకి తాచుపాము ప్రవేశించి హల్‌చల్ చేసింది. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పామును బంధించి తీసుకునివెళ్లాడు. అటవీ ప్రాంతంలో వదిలివేస్తారన్నారు.

ఐదు నీటి సంఘాలకు నేడు ఎన్నికలు
అల్లవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐదు నీటి సంఘాల చైర్మన్ పదవులకు 60ప్రాదేశిక డైరెక్టర్లకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు వీవీఎల్ నరసింహరావు తెలిపారు. 13,962 మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. దేవగుప్తం, తాడికోన, బెండమూర్లంక, గోడిలంక, కొమరగిరిపట్నం నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్వహిస్తారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి
మామిడికుదురు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే నీటిసంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. కొమరాడ, ఆదుర్రు, మగటపల్లి గ్రామాలకు నీటి సంఘాలకు సంబంధించిన సమావేశాన్ని మగటపల్లిలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నామన మాట్లాడుతూ ఆయా గ్రామాల నీటిసంఘాల ఎన్నికల్లో నిలబడిన కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, కార్యదర్శి వర్ధినేని బాబ్జి, మాజీ ఎంపీటీసీ నామన నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి
ముమ్మిడివరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల14న జరిగే నీటిసంఘాల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎన్నికలను నిష్పక్షపాతంగా, నిజాయితీగా నిర్వహించాలని ఆయన సూచించారు. తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ శ్రీలేఖ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
అంతర్వేది, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సఖినేటిపల్లి గీతామందిరం హైస్కూలు, గొందికి సంబంధించి రామేశ్వరం హైస్కూలు, అంతర్వేది హైస్కూలులో ఎన్నికలు జరుగుతాయి. టీసీ మెంబర్లతో పాటు అధ్యక్ష,ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఎన్నికలపై మండల స్థాయి అధికారులకు డిప్యూటీ తహసీల్దారు భాస్కర్ శిక్షణ ఇచ్చారు.

మూడు నీటి సంఘాలకు ఎన్నికలు
అంబాజీపేట, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి, పసుపల్లి, కె.పెదపూడి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు. కె.పెదపూడికి సంబంధించి పుల్లేటికుర్రు హైస్కూల్, పసుపల్లి, ఇసుకపూడిలలో ఎన్నికలు శనివారం ఉదయం 8నుంచి నిర్వహిస్తామన్నారు. ఆయా పరిధిలోని రైతులు పాస్‌బుక్, వీఆర్వో ద్వారా తీసుకున్న రశీదుతో ఓటును వినియోగించుకోవాలన్నారు.

అంతర్వేది బీటీ రోడ్డు పనులు ప్రారంభం
అంతర్వేది, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రూ.25కోట్లతో సంవత్సరం క్రితం ప్రారంభించిన సీసీ, బీటీ రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి. రూ.13కోట్లతో శృంగవరప్పాడు నుంచి అంతర్వేది దేవస్థానం వరకు రోడ్డు వెడల్పు పనులు పూర్తిచేసి అంతర్వేది గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మించారు. పది కిలో మీటర్లకు మూడు కిలోమీటర్ల సీసీ రోడ్డువేసి మిగిలిన బీటీ రోడ్డు పనులను ఇటీవల ప్రారంభించినట్టు జేఈ సురేష్ తెలిపారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన అధికారులు
అమలాపురం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 17వ వార్డులో రహదారి మార్గంపై వివాదాస్పద స్థలాన్ని పోలీసు, మున్సిపల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రహదారి మార్గాన్ని పెన్మెత్స సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులు ఈఏడాది ప్రథమార్థంలో కొనుగోలు చేయడంతో వివాదం ఏర్పడింది. ఎన్నో ఏళ్లుగా రహదారి మార్గంగా ఆప్రాంత వాసులు వినియోగించుకుంటున్నారని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అపార్టుమెంట్లు, గృహాలు నిర్మించుకుని జీవిస్తున్నారని, వాటికి పన్నులు కూడా వేశారని, రోడ్డు మార్గం లేకుండా పన్నులు ఎలా వేస్తారని కౌన్సిలర్ ప్రశ్నించారు. ఇరువర్గాల వారితో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, పట్టణ సీఐ పి.వీరబాబు చర్చించారు. పూర్వరికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకునే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని కమిషనర్ రాజు సూచించారు. ఈవ్యవహారంపై కలెక్టరేట్ నుంచి అమరావతిలోని రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి
రాజోలు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. గురువారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరుకు చెందిన కె.బాబి సొంత పనులపై బైక్‌పై మండపేట వెళ్లి తిరిగి వస్తుండగా వస్తున్నాడు. సోంపల్లి వద్ద రెండు బైక్స్ ఢీకొన్నాయి. ఈప్రమాదంలో పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన పితాని వరుణ్‌కు ఎడమ చేయి విరగడంతో చికిత్స పొందుతున్నాడు. తీవ్రంగా గాయపడిన బాబిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాబి శుక్రవారం మృతి చెందినట్టు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు.

రెండో శనివారం పాఠశాలలు నిర్వహించుకోవచ్చు
ముమ్మిడివరం,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి):పాఠశాలలకు సంబంధించి 220 రోజుల పని దినాలు తక్కువగా ఉన్నవారు డిసెంబరు రెండో శనివారం 14న పాఠశాలలను నిర్వహించుకోవచ్చని డీఈవో షేక్ సలీంబాషా సూచించారు. జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు, అన్నియాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశారు. నీటిసంఘాల ఎన్నికలు ఉన్న పాఠశాలలు విధిగా సెలవు ఇవ్వాలన్నారు. 15న పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని నిర్వహించాల్సిన కాంపిటీషన్లను పూర్తిచేసుకోవాలన్నారు.



ఇసుక లారీలకు ఛిద్రమైన రహదారి

ఓవర్ లోడింగ్, అధిక వేగంతో

ఇసుక లారీలు రయ్..రయ్

• నిర్మించిన ఏడాదిన్నరకే ఛిద్రమైన రోడ్లు • వాహనాల కట్టడికి రైతుల వినతి

ఆత్రేయపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇసుక వాహనాల కారణంగా రహదారులు ఛిద్రమవుతున్నాయి. ప్రతిరోజూ భారీ లోడింగ్‌తో ఇసుక లారీలు రయ్..రయ్‌మని రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. మరోవైపు లొల్ల ప్రధాన లాకులు శిథిలస్థితికి చేరుకోవడంతో భారీ వాహనాలకు అనుమతి నిరాకరించారు. ఆత్రేయపురం, పులిదిండి, వద్దిపర్రు రీచ్‌ల ద్వారా భారీ వాహనాలు ఆత్రేయపురం నుంచి లొల్ల మీదుగా రవాణా సాగించాలి. ఏడాదిన్నర క్రితం కోట్లాది రూపాయలతో ఆర్‌అండ్‌బీ రహదారిని నిర్మించారు. రైతులు తమ పంటలను తరలించుకోవడంతో పాటు వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి కాలనడకన చేరుకునే భక్తుల సౌకర్యార్థం ఈ రహదారిని నిర్మించారు. మూడు ఇసుక ర్యాంపుల ద్వారా వందల సంఖ్యలో లారీలు అధిక లోడింగ్‌తో రయ్..రయ్‌మని రహదారులపై పరుగులు పెడుతున్నాయి. దీంతో నిర్మించిన అనతికాలంలోనే రహదారి ఛిద్రం కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక లారీల కట్టడికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. శుక్రవారం వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,74,437 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ముగిసిన తిరునక్షత్ర ఉత్సవాలు: వాడపల్లి ఆలయంలో ఐదురోజులపాటు జరిపిన తిరునక్షత్ర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆళ్వార్ సన్నిధిలో కొలువై ఉన్న తిరుమంగయ్యై ఆళ్వార్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రకారోత్సవం జరిపి ద్రవిడ వేదపారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు: వాడపల్లి ఆలయంలో ఈనెల 16 నుంచి వచ్చేనెల 13 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనరు, ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు. సోమవారం నుంచి ప్రతిరోజు ఉదయం తీర్థపు బిందెతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం జరుపనున్నారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. ప్రతి శుక్రవారం గోదా అండాళ్ అమ్మవారి గ్రామోత్సవం జరుపనున్నారు. జనవరి 13న గోదాశ్రీరంగనాథుల కల్యాణంతో ధనుర్మాస ఉత్సవాలు ముగియనున్నాయి.



పల్లకి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా లక్ష తమలపాకుల పూజ

ఆత్రేయపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని అయ్యప్ప ఆలయంలోనున్న వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తమలపాకుల పూజ జరిపారు. అశేష భక్తజనం లక్ష తమలపాకులపై శ్రీరామ అని జపిస్తూ గంధ సిందూరంతో భక్తిశ్రద్ధలతో నామం రాశారు. ప్రధాన అర్చకుడు రఘు ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి లక్ష పత్రి పూజ జరిపారు. హనుమంతుడి ఆకారంలో సహస్ర జ్యోతి, సహస్ర నిమ్మకాయలతో జరిపిన దీపాలంకరణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ర్యాలిలో హనుమాన్‌కు లక్ష తమలపాకుల పూజ నిర్వహించిన దృశ్యం →





మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలి

రాయవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులో 15న జరిగే మాలల సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని పీవీ రావు మాల మహానాడు కార్యవర్గ సభ్యుడు కాకర రాము పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో నిర్వహిస్తున్న సింహగర్జన మహాసభలో లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పోలిమాటి సుధాకర్, సత్యనారాయణ, దండంగి ప్రైసాదాసు, కత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రావులపాలెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజోలు మండలం జగ్గన్నపేటకు చెందిన బైరిశెట్టి ప్రజ్ఞశ్రీ అనే పాపకు హైఫీవర్ కారణంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. ఇప్పటి వరకు తల్లిదండ్రులు రూ.15లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంక ఖర్చుపెట్టే స్థోమత లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తూ రావులపాలెంకు చెందిన అక్షయ సేవా సంస్థ సభ్యులను సాయం కోరా రు. దీంతో అక్షయ సంస్థ నుంచి రూ.10వేలు, మేడపాటి బాలాజీరెడ్డి(లండన్) రూ.5 వేలు, మిరియాల సుబ్బరాజు రూ.1000, దండుప్రోలు విజయ్ రూ.10,000 ఈ మొత్తాన్ని అక్షయ సేవా సంస్థ సభ్యులు వారి తల్లిదండ్రులకు అందించారు.

బాలిక కడుపులో కిలోన్నర జుట్టు తొలగింపు

అమలాపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం బట్టుపాలెం గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలిక కడుపు నొప్పితో బాధపడుతుంటే తల్లిదండ్రులు అమలాపురం సమీపంలోని సాయివిశ్వాస్ ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్ గంధం విశ్వనాథ్ బాలికకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ ద్వారా పొట్టలో జుట్టు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే సర్జరీచేసి ఆమె కడుపులో ఉన్న కిలోన్నర జుట్టును తొలగించారు. మూడేళ్లుగా బాలిక తన జుట్టు తానే తింటూ వింత అలవాటు చేసుకుంది. జుట్టు తినడం ప్రారంభించిన నాటి నుంచి తరచుగా బాలికకు వాంతులు అవుతుండడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యులతో వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో శస్త్ర చికిత్స ద్వారా కిలోన్నర జుట్టును తొలగించారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

భక్తి శ్రద్ధలతో హనుమద్ వ్రతాలు



మండపేటలో అభయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రత పూజ చేస్తున్న అర్చకస్వామి

ఆలమూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హనుమద్ వ్రత పర్వదిన సందర్భంగా ఆలమూరు మండలంలో హనుమాన్ ఆలయాల్లో హనుమద్ వ్రత పూజలు జరిపారు. ఆలమూరు మెయిన్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు జరిపారు. చింతలూరు, పెదపళ్ల, సంధిపూడి, పినపళ్ల, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, చొప్పెల్ల, చెముడులంక, మడికి, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, కలవచర్ల, పెనికేరు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో వ్రతపూజలు చేశారు. ఉదయం నుంచే పలువురు భక్తులు ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలమూరులోని హనుమాన్ ఆలయంలో ప్రధానార్చకుడు కాళ్లకూరి సూరిపండు అధ్వర్యంలో హనుమాన్ వ్రత విశిష్టతను భక్తులు తెలిపారు. ఈ వ్రతం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను భక్తులకు తెలిపారు.

కె.గంగవరం: మండలంలోని గంగవరం, కోటిపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం హనుమద్ వ్రత వేడుకలు జరిపారు. గంగవరం భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద సుదర్శనం లక్ష్మీనారాయణాచార్యుల ఆధ్వర్యంలో లక్షతులసీదళ, సిందూర పూజలు, నాగవల్లీపత్ర పూజలు చేశారు. కోటిపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో హోమం, పత్రిపూజ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

మండపేట: హనుమద్ వ్రతాల సందర్భంగా శుక్రవారం సీతారామక్షేత్రాలు హనుమాన్ మంత్ర జపాలతో మారుమోగాయి. కరాచీ సెంటరులో అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ఖండవల్లి పవన్‌కుమార్ సారధ్యంలో గంధసిందూర పూజ, లక్ష తమలపాకుల పూజ, పంచామృతాభిషేకం చేశారు. మండపేటలోని బూరుగుంట రామాలయం వద్ద యోగముద్రలో వున్న ఆంజనేయస్వామికి, రథంగుడి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కేపీ రోడ్డులో వున్న ఆంజనేయస్వామికి పలు వార్డుల్లో వున్న ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమద్ వ్రతాలు జరిపారు. మండపేటలో వున్న సీతారామ క్షేత్రంలో హనుమద్ వ్రతాన్ని పురస్కరించుకుని హనుమాన్ పారాయణ, ప్రత్యేక పూజలు, భజనలు జరిపారు.



ఆలమూరులో ఆంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం



కపిలేశ్వరపురం మండలం అంగరలో ప్రత్యేక అలంకరణలో అంజనీపుత్రుడు

మండపేట మండలంలో తాపేశ్వరం, అర్తమూరు, ఇప్పనపాడు, ద్వారపూడి, కేశవరం, జెడ్.మేడపాడు, ఏడిద, వై.సీతానగరం, పాలతోడు, వెలగతోడు తదితర గ్రామాలో హను మంతుని ఆలయాల్లో వ్రతాలు, పూజలు, అభిషేకాలు జరిగాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు హనుమాన్ ఆలయాల్లో శుక్రవారం హనుమద్ వ్రతం జరిపారు. అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, గంధ సిందూరం, తమలపాకులు, తులసీ దళాలతో ఆయా ఆలయాల అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వామివారి గ్రామోత్సవం జరపగా, భక్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు పూజలు

కొత్తపేట: మోడేకుర్రు శివారు రాకుర్తిపాలెంలోనున్న ఆంజనేయస్వామి వార్షిక వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక పూజలు జరిపారు. కురసా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరెళ్ళ సరిత, రెడ్డి శ్రీనివాస్, జక్కంశెట్టి చంటి, సరెళ్ళ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట మండలం రాకుర్తిపాలెంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కోటిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద హోమం చేస్తున్న భక్తులు

నీటి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



ఆలమూరులో సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ తరగతులు జరిపారు. శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో రాజు, ఇరిగేషన్ ఏఈ కృష్ణ త్రిమూర్తులు, మండల పరిషత్ ఏవో మెహర్‌ప్రకాష్ పాల్గొని ఎన్నికల నియమావళి తెలిపారు. ఎన్నికలకు 48 మంది పోలింగ్ అధికారులు, 48 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులను నియమించామన్నారు.

కె.గంగవరం: మండలంలో ఏడు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి తహశీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. ఎన్నికల విధులకు ఎంపిక చేయబడిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం పరిధిలో 5 నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ సావిత్రి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. టీసీ సభ్యులు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్ను కుంటారని తెలిపారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 5 నీటి యాజమాన్య సంఘాలకు సంబంధించి శనివారం సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పి.చిన్నారావు తెలిపారు. కాలేరు, మాచర, అంగర, వల్లూరు ఉన్నత పాఠశాలల్లోను, తాతపూడి సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో రైతులు పాస్ బుక్ లేదా ఆధార్ కార్డు లేదా వీఆర్‌వో ధ్రువ పత్రం కానీ తీసుకువెళ్ళి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.



కె.గంగవరంలో ఎన్నికల సామగ్రిని అందిస్తున్న తహశీల్దార్ మృత్యుంజయరావు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

వైసీపీ నేతల కలెక్టరేట్ ముట్టడి

వివిధ డిమాండ్లతో వినతిపత్రం అందజేత

అమలాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందిందని ఆరోపిస్తూ వైసీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు కొద్దిసేపు నిరసన ధర్నా నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నాయకత్వంలో ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పరిషత్ చైర్మన్‌విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, గొల్లపల్లి సూర్యారావు, పొన్నాడ సతీష్‌కుమార్, పాముల రాజేశ్వరీదేవి, నేతలు పిల్లి సూర్యప్రకాష్, కొవ్వూరి త్రినాథరెడ్డి, పితాని బాలకృష్ణ, జిన్నూరి బాబి, పినిపే శ్రీకాంత్ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం విశ్వరూప్ ఆధ్వర్యంలో నేతలు కలెక్టరేట్‌లోకి వెళ్లి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వో మదన్‌మోహన్ రావుకు అందజేశారు. అమలాపురం మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత్‌భూషణ్, కాశి బాలమునికుమారి, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, కుడుపూడి భాగ్యలక్ష్మిబాబు, వంటెద్దు వెంకన్నాయుడు, పొగాకు శ్రీను, కుంపట్ల నాయుడు, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

రావులపాలెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్, పొలిటికల్ సైన్సు అధ్యాపకుడు ఎస్. రాజకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు అధ్యక్షతన ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన జరిపారు. దీనికి ముఖ్య అతిథిగా విశాఖ ఏవీఎన్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యప్రకాశరావు పాల్గొని మాట్లాడారు. వరదలు తుఫాన్లు, భూకంపాలు, సునామి సంభవించినప్పుడు విద్యార్థులు, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాయ్, ప్రజ్ఞాన్, దుర్గ, అధ్యాపకులు హరిబాబు, వరప్రసాద్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం సుందరపల్లి సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ మృత్యుంజయరావు

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం



కపిలేశ్వపురం: కాలేరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

కె.గంగవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. శుక్రవారం మండలంలోని సుందరపల్లి, తామరపల్లి గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి దరకాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మురళి, ఆర్ఐ వెంకట్రావు, టీడీపీ సీనియర్ నాయకుడు శీరెడ్డి సత్తిబాబు, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, సుందరపల్లి సర్పంచ్ సలాది లక్ష్మీశిరీష తదితరులు పాల్గొన్నారు.

కాలేరులో రెవెన్యూ సదస్సు

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిపారు. ఈసందర్భంగా భూసమస్యలు, దేవదాయ ధర్మాదాయ శాఖల భూవివాదాలు, సర్వే, తదితర సమస్యల పరిష్కారానికై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్ పి. చిన్నారావు, మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో కామేశ్వరరావు తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జమ్మ, వీఆర్‌వోలు, సర్వేయర్లు, పంచాయతీ, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



డ్రైయిన్‌ను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ సుధ

డ్రైయిన్లలో పూడిక తొలగింపు

ఆత్రేయపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలోని ప్రధాన డ్రైయిన్లు మూసుకుపోవడంతో పూడికతీత కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం డ్రైనేజీలలో పూడిక తీస్తున్న పనులను సర్పంచ్ గెడ్డం సుధ పరిశీలించారు. పూడికతీసిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్త, చెదారాన్ని డ్రైయిన్లలో పడేయవద్దని సూచించారు. వాటిని పడేయడం వల్ల డ్రైయిన్లు పూడుకుపోయి మరిన్ని సమస్యలు వస్తాయని ఆమె అన్నారు.

నిందితుడిని శిక్షించాలి

రాయవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత దివ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వెంటూరులో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దివ్యాంగురాలైన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడటం అమానుషమన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు లొల్ల విశ్వమానవత ఆశ్రమంలో జిల్లాస్థాయి పోటీలు

రాయవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్ల విశ్వమానవత సంస్థ ఆధ్వర్యంలో 15న జిల్లాస్థాయిలో సూర్యనమస్కారాలు, యోగాసనాలు, గీతా శ్లోకాలు, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు విశ్వమానవత సంస్థ అధినేత అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. శుక్రవారం లొల్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ తన తల్లి వరలక్ష్మి వర్థంతిని పురస్కరించుకుని విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. తొలుత దత్త జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా గర్భిణులకు ఆరోగ్య వైద్య శిబిరం, యోగా, పౌష్టికాహారంపై అవగాహన, గీతా సందేశం వివరించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 9966673283 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ మానవతా డాట్ ఓఆర్‌జీని సంప్రదించాలన్నారు.

జర్నలిస్టుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై నటుడు మోహన్‌బాబు దాడిని నిరసిస్తూ శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద రామచంద్రపురం నియోజకవర్గ జర్నలిస్టులు ధర్నా చేశారు. మోహన్‌బాబును అరెస్టు చేయాలని జర్నలిస్టులపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో దేవరకొండ అఖిలకు వినతిపత్రం ఇచ్చారు. డీఎస్పీ బి.రామకృష్ణకు కూడా వినతిపత్రం అందించారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఆలమూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ పోలీసులు జరిపిన దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. మడికి గ్రామానికి చెందిన ఉండ్రాసపు శాంతకుమారి, మండపేట మండలం యేడిద గ్రామానికి చెందిన యార్లగడ్డ వీరవేణి నాటుసారా విక్రయిస్తుండగా పది లీటర్ల సారాతో అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. నిందితులను ఆలమూరు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.